ప్రజాశక్తి

సోమవారం 17 నవంబర్ 2025

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

ముఖ్యమంత్రివి వంచన వ్యాఖ్యలు

◆ స్టీల్‌ప్లాంట్‌కు ద్రోహం చేస్తూ కార్మికులపై నిందలు

◆ చంద్రబాబు తీరుపై సిపిఎం, సిఐటియు మండిపాటు

'పనిచేయకున్నా జీతా లివ్వాలా ?' అంటూ సిఎం చంద్రబాబు శనివారం విశాఖ వేదికగా స్టీల్‌ప్లాంట్ కార్మికులపై చేసిన వ్యాఖ్యల పట్ల సిపిఎం, సిఐటియు విశాఖ, అనకాపల్లి జిల్లా కమిటీలు మండిపడ్డాయి. ఆయన వ్యాఖ్యలను ఖండించాయి.

మాట్లాడుతున్న సిఐటియు నాయకులు శంకరరావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం, రాష్ట్రంలోని చంద్రబాబు ప్రభుత్వం కూడబలుక్కొని నష్టాల్లోకి నెడుతున్నాయని, ఆ ద్రోహాన్ని కప్పిపెట్టేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్టీల్ ప్లాంట్ కార్మికులపై అభాండాలు వేయడం దుర్మార్గమని సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు ఒక ప్రకటనలో తీవ్రస్థాయిలో ఆదివారం మండిపడ్డారు. స్టీల్‌ప్లాంట్ కార్మికులు, ఉద్యోగులు పనిచేయకపోతే ప్లాంట్ విస్తరణ ఎలా సాధ్యమైందని ప్రశ్నించారు. సంస్థ రివైవల్ కోసం రూ.12 వేల కోట్ల నిధులు సమకూర్చామని ముఖ్యమంత్రి ప్రకటించారని, ఆ నిధులను జిఎస్‌టికి, బ్యాంకు అప్పులు, ఇతర అప్పులు తీర్చడానికి, కార్మికుల తొలగింపునకే ఉపయోగించారని గుర్తుచేశారు. కార్మికులను ఇష్టానుసారం తొలగిస్తూ ఉత్పత్తికి ఆటంకం సృష్టిస్తున్నది డబుల్ ఇంజిన్ సర్కార్ కాదా ? అని ప్రశ్నించారు. అన్ని స్టీల్ ప్లాంట్లకు లాభాలు వస్తున్నాయని, విశాఖ స్టీల్‌కు మాత్రం రావడం లేదని సిఎం తెలిపారని జగ్గునాయుడు పేర్కొంటూ దేశంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేటు రంగ స్టీల్‌ప్లాంట్లకు కేంద్ర ప్రభుత్వం సొంత గనులు కేటాయించిందని, ఒక్క విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌కు మాత్రమే గనులు ఇవ్వలేదని, ఆ విషయం సిఎం గుర్తెరగాలని అన్నారు. సొంత గనుల కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు అడగడం లేదన్నారు. దీనివల్ల విశాఖ ఉక్కు ప్రతి టన్ను స్టీల్ ఉత్పత్తికి సుమారు రూ.6 వేలు అదనపు ఉత్పత్తి ఖర్చు భరిస్తోందని, ఈ నష్టాలకు కారణం డబుల్ ఇంజిన్ సర్కార్ అయితే, కార్మికులపై ముఖ్యమంత్రి అభాండాలు వేయడం ప్రజలను మోసగించడమే అవుతుందని అన్నారు.

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో గోల్డ్ మైన్ (బంగారపు గని)గా ముఖ్యమంత్రి పేర్కొంటూనే, దీని నష్టాలకు కార్మికులను బలి పశువులను చేయాలని చూడటం పరమ దుర్మార్గమన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రికి స్టీల్‌ప్లాంట్ రక్షణ ఎడల చిత్తశుద్ధి ఉంటే విశాఖ ఉక్కుకు సొంత గనులు సాధించాలన్నారు. ఉద్యోగుల, కార్మికుల అక్రమ తొలగింపులు నిలిపివేయాలన్నారు. ఆర్థిక ప్యాకేజీని సంస్థ పురోభివృద్ధికి వినియోగించాలని జగ్గు నాయుడు డిమాండ్ చేశారు. కార్మికులు పనిచేయడం లేదని నిన్నటి వరకు గాజువాక శాసనసభ్యులు మిగతా 2లో..

ఎంఒయులు అమలయ్యేనా ?

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖలో రెండు రోజుల పాటు భారత పరిశ్రమల సమాఖ్య (సిఐఐ), రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన భాగస్వామ్య సదస్సుకు పెద్ద ఎత్తున పెట్టుబడులపై ఎంఒయులు వచ్చినా వాటి అమలుపై సదస్సులో పాల్గొన్న వారినుంచే అనుమానాలు వ్యక్తమవడం గమనార్హం. గత భాగస్వామ్య సదస్సుల్లో కుదుర్చుకున్న ఒప్పందాలు నేటికీ అమలుకాకపోవడం ఈ అనుమానాలను బలపరుస్తోంది. అయితే గతంతో పోల్చితే సదస్సులో కొంత మార్పు కనిపించింది. పెట్టుబడులు ఎవరెవరి నుంచి సాధించి ఎంఒయులు కుదుర్చుకోవాలన్న అంశంపై ముందుగానే కసరత్తు జరిగి కేబినెట్‌లో ముందస్తు అనుమతులను ఇచ్చేయడం గమనించదగ్గ విషయం. 2016, 2017, 2018 సంవత్సరాల్లో వరుసగా చంద్రబాబు హయాంలో జరిగిన పెట్టుబడుల సదస్సుల ఎంఒయులు రూ.లక్షల కోట్లలో ఉన్న విషయం విదితమే. వీటి అమలు మాత్రం 12 శాతంలోపే. ఈ సారి అలా కాదని సిఎం చంద్రబాబు, ఐటి మంత్రి లోకేష్ గట్టిగానే విశాఖ సదస్సులో నొక్కి చెప్పారు. అయితే, విశాఖలో పెట్టుబడుల సదస్సును ప్రభుత్వం నిర్వహిస్తూ రాష్ట్రంలోని మిగతా చోట్లకు అత్యధిక ఎంఒయులు చేయించుకుందన్న విమర్శ హాజరైన ప్రతినిధుల మధ్య రెండోరోజు శనివారం వినిపించింది. ముఖ్యంగా అమరావతికి అధిక ప్రాజెక్టులు రాబోతున్నాయన్న సంకేతాలు వెల్లడయ్యాయి. విశాఖకు మాత్రం ప్రపంచంలో ఎక్కడా అక్కరలేని గూగుల్, అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ, ఆర్సెలార్ మిట్టల్ వంటి కాలుష్య కంపెనీలే రాబోతున్నాయన్నది సర్వత్రా చర్చ సాగుతోంది. అయితే ఎంఒయులు సందర్భంగా పైన తెలిపిన కంపెనీలకు చెందిన ప్రతినిధులెవ్వరూ హాజరుకాకపోవడం విశేషం. అత్యధిక ఎంఒయులు ఏయూలో సిఐఐ సదస్సు ప్రాంగణంలోగల హాల్ నెంబర్ 7లో జరిగాయి. వీటికి నేరుగా సిఎం చంద్రబాబు, ఐటి మంత్రి లోకేష్ హాజరయ్యారు.

గూగుల్ సంగతేంటి ?

విశాఖ జిల్లా ఆనందపురం మండలం తర్లువాడ వద్ద గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు కాబోతున్నట్లు, దీనికి భూమి పూజ ఈ సిఐఐ సదస్సు ద్వారా వర్చువల్‌గా చేయనున్నట్టు తొలుత ప్రచారం సాగింది. ఎందుకోగానీ సిఎం చంద్రబాబు ఆలోచనకు ఈ సదస్సులో బ్రేక్ పడింది. గూగుల్‌పై రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల కాలం వరకూ సాగించిన ప్రచారం... ప్రచారంగానే మిగిలిపోయింది. అత్యంత ప్రతిష్టాత్మకంగా దేశం అంతటా రాష్ట్రంలోని 'కూటమి' ప్రభుత్వం చేసిన ప్రచారం అంతా పటాపంచలైంది. భూమిపూజకు ముఖ్యమంత్రి వెనకడుగు వేశారు. ఈ విషయమై మిగతా 2లో..

విశాఖలో 50 అంతస్తుల ఐకానిక్ భవన నిర్మాణం

▸ వార్త మెయిన్‌లో..

'అనంతుని' దీపోత్సవానికి ఏర్పాట్లు

▸ వార్త 3లో..

పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి చర్యలు

▸ వార్త 8లో..

ఎంవిపి.కాలనీ శాఖా గ్రంథాలయంలో చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

విజ్ఞానదాయకంగా గ్రంథాలయ వారోత్సవాలు

ఉత్సాహంగా చిత్రలేఖనం, పద్య పఠనం పోటీలు వార్తలు 7లో..

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

'ప్రజాశక్తి'తో అనకాపల్లి జిల్లా పరిశ్రమల శాఖ అధికారి ప్రసాద్

ప్రజాశక్తి - అనకాపల్లి

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అన్ని విధాలా అండగా ఉంటామని, ప్రోత్సాహకాలు అందిస్తామని అనకాపల్లి జిల్లా పరిశ్రమల శాఖ అధికారి పికెపి.ప్రసాద్ తెలిపారు. జిల్లా పరిశ్రమల కేంద్రం చేపడుతున్న శ్రామిక అభివృద్ధి, పెట్టుబడి అవకాశాలు, ప్రాజెక్టుల ఎంపికలో మార్గదర్శకత్వం, సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా అనుమతులు, వాణిజ్య బ్యాంకులతో సమన్వయం తదితర అంశాలను ఆయన 'ప్రజాశక్తి'తో పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు మీరందిస్తున్న ప్రోత్సాహం ఎలా ఉంది ?

అనకాపల్లి నూతన జిల్లాగా ఏర్పడిన తర్వాత కొత్త పారిశ్రామికవేత్తలను గుర్తించడం, వారికోసం అవగాహన శిబిరాలు ఏర్పాటు చేయడం, పెట్టుబడి అవకాశాలను వివరించడం, ప్రభుత్వ పథకాలపై సమాచారాన్ని అందించడం చేస్తున్నాం. వ్యాపారవేత్తలకు అనుకూలమైన, సాంకేతికంగా సాధ్యమయ్యే లాభదాయకమైన ప్రాజెక్టుల ఎంపిక, గ్రౌండింగ్ నుంచి చివరి దశ వరకు మార్గదర్శకత్వం, పరిశ్రమల స్థాపన కోసం సింగిల్ డెస్క్ పోర్టల్ కింద దరఖాస్తు చేసుకున్న వారికి అనుమతులు ఇచ్చి, వాటి పర్యవేక్షణ చేస్తున్నాం. వాణిజ్య బ్యాంకులతో సమన్వయం చేసుకుంటున్నాం. భారీ మెగా ప్రాజెక్టర్లు, ఎంఎస్ఎంఇల డేటా బేస్‌ను నిర్వహిస్తున్నాం. అర్హత ఉన్న ఎంఎస్ఎంఇలకు ప్రోత్సాహకాలు అందిస్తున్నాం.

పరిశ్రమలను ఎలా వర్గీకరిస్తున్నారు ?

యంత్ర పరికరాల పెట్టుబడి ఆధారంగా మైక్రో ఎంటర్ప్రైజెస్, స్మాల్ ఎంటర్ప్రైజెస్, మీడియం ఎంటర్ప్రైజెస్‌గా వర్గీకరిస్తున్నాం. యంత్రాలు, పరికరాలు, పెట్టుబడి కోటి రూపాయలు ఉండి ఐదు కోట్ల వరకు వార్షిక టర్నోవర్ ఉంటే మైక్రో, అలాగే 10 కోట్ల వరకు యంత్రాలు పరికరాల పెట్టుబడి, వార్షిక టర్నోవర్ 50 కోట్లు ఉంటే స్మాల్, 50 కోట్ల వరకు యంత్రాలు, పరికరాలు, పెట్టుబడి ఉండి రూ.250 కోట్ల వరకు వార్షిక టర్నోవర్ ఉంటే మీడియం ఎంటర్ప్రైజెస్‌గా గుర్తిస్తున్నాం.

అభివృద్ధికి అవకాశం ఉన్న రంగాలేంటి ?

వ్యవసాయ, ఖనిజ ఆధారిత, పాలు, పాల ఉత్పత్తులు, డిమాండ్ ఆధారిత పరిశ్రమలు, సేవా రంగ పరిశ్రమలు, ఆటోమొబైల్ అనుబంధ పరిశ్రమలు, ఎగుమతులకు అవకాశం ఉన్న వస్తు రంగాలు అభివృద్ధి దశలో మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

ఎంఒయులు అమలయ్యేనా ?

మీడియా సమావేశంలో శనివారం సాయంత్రం ఆయన్ని ప్రశ్నించగా కొన్ని చిన్న చిన్న సాంకేతిక సమస్యలున్నందున భూమిపూజ చేయలేకపోయామని సంజాయిషీ చెప్పాల్సి వచ్చింది.

మంత్రుల పర్యవేక్షణ.. అధికారుల అమలు

రూ.13 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు 20 లక్షలకుపైగా ఉపాధి, ఉద్యోగ అవకాశాలకు ఈ సిఐఐ పార్టనర్‌షిప్ సమ్మిట్ మార్గం సుగమం చేసేందుకు అధికార యంత్రాంగం కృషిచెయ్యాలని, మంత్రులు పర్యవేక్షిస్తారని సిఎం చంద్రబాబు ముగింపు సభలో వెల్లడించడం గమనార్హం.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

ఉన్నాయి. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఎంచుకున్న పరిశ్రమపై అవగాహన, నమ్మకం, ఆత్మవిశ్వాసం ప్రధానంగా ఉండాలి. అందుకోసం సరికొత్త ప్రాజెక్టులు ఉన్నాయి. వాటి నుంచి వారికి ఇష్టమైన ప్రాజెక్టును ఎంపిక చేసుకోవచ్చు.

సింగిల్ డెస్క్ విధానం గురించి వివరించండి ?

రాష్ట్రంలో పారిశ్రామిక ప్రగతిని వేగవంతం చేయడానికి ప్రభుత్వం సింగిల్ డెస్క్ విధానం ప్రవేశపెట్టింది. వివిధ ప్రభుత్వ శాఖలను సందర్శించాల్సిన అవసరం లేకుండా పరిశ్రమ ఏర్పాటు చేయడానికి అవసరమైన అన్ని అనుమతులను 21 రోజుల్లో ఆన్లైన్ ద్వారా తీసుకునే సౌలభ్యం ఈ విధానం ప్రత్యేకత. పరిశ్రమ పెట్టదలుచుకున్న వారు కేంద్ర ప్రభుత్వ ఆన్లైన్ లింకు https://udayamregistration.gov.in ద్వారా ఎలాంటి రుసుము లేకుండా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం గురించి తెలియజేస్తారా ?

18 సంవత్సరాలు నిండిన వ్యక్తులు ఈ పథకానికి అర్హులు. రూ.10 లక్షల పెట్టుబడి పైబడి ఉత్పత్తి తయారీ యూనిట్స్‌కు, ఐదు లక్షల పెట్టుబడి పైబడి సర్వీసింగ్ యూనిట్స్‌కు తప్పనిసరిగా ఎనిమిదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ఉత్పత్తి తయారీ యూనిట్‌కు గరిష్టంగా 50 లక్షల వరకు, సర్వీసింగ్, ట్రేడింగ్ యూనిట్లకు గరిష్టంగా 20 లక్షల వరకు పెట్టుబడిపై సబ్సిడీ వస్తుంది. ఆపై పెట్టుబడికి కూడా రుణం పొందవచ్చు కానీ సబ్సిడీ వర్తించదు. ఈ పథకాన్ని జిల్లా పరిశ్రమల కేంద్రం, ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్, ఏపి ఖాదీ, గ్రామీణ పరిశ్రమల మండలి చేపడుతున్నాయి.

సబ్సిడీ వివరాలు తెలియజేయండి ?

జనరల్ కేటగిరీలో పట్టణ ప్రాంతాల్లో 15, గ్రామీణ ప్రాంతాల్లో 25 శాతం రాయితీ ఇవ్వగా లబ్ధిదారుని వాటా పది శాతం ఉండాలి. అలాగే ప్రత్యేక కేటగిరీ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, ఉమెన్, మైనారిటీస్, దివ్యాంగులు, ఎక్స్ సర్వీసర్లకు పట్టణ ప్రాంతాల్లో 25 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 35 శాతం ఇస్తుండగా లబ్ధిదారుని వాటా ఐదు శాతం ఉండాలి. అస్తులను ఆన్లైన్ విధానంలో https://www.k kviconline.gov.in/pmegpeportal ద్వారా సమర్పించాలి.

పంచారామాల బస్సులకు ఆదరణ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఏపిఎస్ ఆర్‌టిసి ద్వారకా బస్ స్టేషన్ విశాఖపట్నం నుండి ఆదివారం పంచారామాలకు ఆరు బస్సులు బయలుదేరాయి. ఈ సందర్భంగా సంస్థ రీజనల్ మేనేజర్ బి.అప్పలనాయుడు మాట్లాడుతూ ఈ సంవత్సరం కార్తీక మాసంలో పంచారామాలకు మంచి స్పందన వచ్చిందన్నారు. అదేవిధంగా అయ్యప్ప స్వామి భక్తులకు కూడా ఇప్పటికే విశాఖపట్నం నుండి ఐదు బస్సులు బుక్ అయ్యాయని, ఇంకా మరిన్ని బస్సులు శబరిమల యాత్రకు బయలుదేరుతాయని, ఈ అవకాశాన్ని భక్తులు వినియోగించుకోవాలని కోరారు.

డాక్టర్ మాటూరికి సాహిత్య పురస్కారం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: నగరానికి చెందిన కవి, రచయిత, ప్రముఖ వైద్యులు డాక్టర్ మాటూరి శ్రీనివాస్‌కు గిద్దాడ బ్రహ్మయ్య మెమోరియల్ ట్రస్ట్ సాహిత్య పురస్కారం 2025 దక్కింది. కాకినాడకు చెందిన ప్రముఖ నవలా రచయిత్రి డాక్టర్ కస్తూరి ప్రసాద్ (రాధిక) ఈ సంవత్సరం గిద్దాడ బ్రహ్మయ్య మెమోరియల్ ట్రస్ట్ వార్షిక రాధిక సాహితీ పురస్కారం డాక్టర్ మాటూరి శ్రీనివాస్ కి ప్రదానం చేస్తున్నట్టు పత్రిక ప్రకటన ద్వారా తెలిపారు.

స్వధార,తెరకోయ, దయాశోకం వంటి గ్రంథాలు రాసిన డాక్టర్ మాటూరి బౌద్ధ రచయితగా ప్రసిద్ధులు అన్నారు. ప్రస్తుతం ఆయన 'బుద్ధభూమి' పత్రిక గౌరవ సలహాదారుగా ఉన్నారు. నగరంలో సమతా సాహితీ సంస్థను నెలకొల్పారు. ఈ సందర్భంగా డాక్టర్ మాటూరికి అరసం అధ్యక్షులు ఉప్పల అప్పలరాజు, సమతా సాహితీ వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ బండి సత్యనారాయణ, బొజ్జ పావని, డాక్టర్ డి.వి సూర్యారావు తదితరులు అభినందనలు తెలిపారు.

మయోపియాపై అవగాహన

- బీచ్ రోడ్డులో 300 మందితో ర్యాలీ

ప్రజాశక్తి- ఎంవిపికాలనీ: భారతదేశంలో, ముఖ్యంగా పిల్లల్లో మయోపియా (హ్రస్వదృష్టి) వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విశాఖపట్నంలోని ఎల్‌వి ప్రసాద్‌నేత్ర వైద్యశాల, జిఎంఆర్ వరలక్ష్మి క్యాంపస్ ఆధ్వర్యంలో ఆదివారం భారీ ర్యాలీ నిర్వహించారు. నవంబర్ 10 నుంచి 16 వరకూ నిర్వహించిన 'పిల్లల నేత్ర సంరక్షణ వారోత్సవాలు' ఈ ర్యాలీతో ఘనంగా ముగిశాయి.ఉదయం బీచ్‌రోడ్‌లోని కాళీమాత గుడి నుండి వైఎంసిఏ వరకూ సుమారు 300 మంది పిల్లలు , వారి తల్లిదండ్రులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎల్‌విప్రసాద్ కన్సల్టెంట్ పీడియాట్రిక్ ఆప్తాల్మజిస్ట్ డాక్టర్ అదితి పారిఖ్ సమీర్‌బాయ్ మాట్లాడుతూ పిల్లలను జాగ్రత్తగా గమనిస్తూ ఉండాలని వస్తువులను సరిగా గుర్తించలేకపోతే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. ఎల్‌విప్రసాద్ క్యాంపస్ హెడ్ డాక్టర్ వీరేంద్ర సచ్‌దేవా మాట్లాడుతూ మయోపియాను ముందుగా గుర్తిస్తే మెరుగైన చికిత్స అందించవచ్చన్నారు.

ముఖ్యమంత్రివి వంచన వ్యాఖ్యలు

(మొదటి పేజీ తరువాయి..) పల్లా శ్రీనివాసరావు దుష్ప్రచారం చేశారని, ప్రజలు దీనిని విశ్వసించలేదని, ఇప్పుడు ముఖ్యమంత్రి ఈ దుష్ప్రచారానికి పూనుకున్నారని విమర్శించారు. స్టీల్‌ప్లాంటు ఉద్యోగులకు, పర్మినెంట్ కార్మికులకు సంవత్సరం నుండి పూర్తి జీతం ఇవ్వడం లేదన్నారు. ఉద్యోగ విరమణ చేసిన వారికి పూర్తిస్థాయి బకాయిలు చెల్లించడం లేదన్నారు. అయినా సంస్థ అభివృద్ధి కోసం ఉద్యోగులు, కార్మికులు ఆర్థిక ఇబ్బందులను తట్టుకొని రేయింబవళ్లు కష్టపడి ఉత్పత్తి చేస్తున్నారన్నారు. బాధ్యతగల ప్రభుత్వమైతే వారిని అభినందించాలన్నారు. వారితో ఈ విధంగా పనిచేయిస్తున్నందుకు ముఖ్యమంత్రి, డబుల్ ఇంజన్ సర్కారు ప్రభుత్వాలు సిగ్గుపడాలని జగ్గునాయుడు ఎద్దేవా చేశారు. అధికార యంత్రాంగం చేతిలో ఉంది కదా అని ఏం చెప్పినా చెల్లిపోతుందనే ధోరణితో ముఖ్యమంత్రి వ్యాఖ్యలు ఉన్నాయన్నారు. ఎన్నికల ముందు చంద్రబాబు కూటమి నేతల ప్రకటనలు, అధికారం చేపట్టాక వ్యవహరిస్తున్న తీరును విశాఖ ఉక్కు కార్మికులతో పాటు, విశాఖపట్నం, రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి, కూటమి ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలో రక్షించి, సంస్థ, ఉద్యోగ కార్మికుల అభివృద్ధికి కావలసిన అన్ని చర్యలను తక్షణమే చేపట్టాలని డిమాండ్ చేశారు.

సొంత గనులు ఎందుకు కేటాయించరు ?

విశాఖ స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు ఎందుకు కేటాయించరని, మిట్టల్ కంపెనీపై ఉన్న ప్రేమ విశాఖ స్టీల్ ప్లాంట్‌పై ఎందుకు లేదని సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ ఒక ప్రకటనలో ప్రశ్నించారు. స్టీల్ ప్లాంట్‌లో కార్మిక వర్గం పని చేయటం లేదని, ఎంతకాలం కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం డబ్బులు ఇవ్వాలని చంద్రబాబు ప్రశ్నించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కార్మికులు పనిచేయడం లేదని ఏ విధంగా చెప్పగలుగుతున్నారని ప్రశ్నించారు. కార్మికులు పనిచేయకపోతే ప్లాంట్‌లో ఎవరు పని చేస్తున్నారని అడిగారు.

దుర్మార్గమైన వ్యాఖ్యలు

అనకాపల్లి : కార్మికులు పనిచేయక పోవడం వల్లే విశాఖ స్టీల్‌ప్లాంట్ నష్టాల బారిన పడిందని సిఎం చంద్రబాబు ఎద్దేవా చేయడం దుర్మార్గమని, తక్షణం ఆ వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని సిఐటియు అనకాపల్లి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వివి.శ్రీనివాసరావు, ఆర్ శంకరరావు డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక సిఐటియు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ సొంత గనులు ఇవ్వకపోవడంతో ఉత్పత్తి వ్యయం పెరిగి, స్టీల్ ప్లాంట్‌కు భారమైందన్న విషయం తెలిసిన ముఖ్యమంత్రి ఈ విధంగా వ్యాఖ్యలు చేయటం సరికాదన్నారు. అనకాపల్లి జిల్లాలో మిట్టల్ స్టీల్‌ప్లాంట్ ప్రారంభం కాకుండానే, దానికి సొంత గనుల కోసం ప్రధానితో మాట్లాడుతున్న చంద్రబాబు, విశాఖ స్టీల్ విషయంలో అటువంటి చొరవ ఎందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఎందరో ప్రాణాలు, ఆస్తుల త్యాగానికి ప్రతిరూపమైన వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌ను కార్పొరేట్లకు కట్టబెట్టే ముందు దాన్ని పిప్పికుక్కగా మార్చేసి మట్టుబెట్టాలని చూడడం దుర్మార్గమన్నారు. సమావేశంలో సంఘం జిల్లా కమిటీ సభ్యులు కె.ఈశ్వరరావు పాల్గొన్నారు.

ప్రభుత్వాల తప్పిదాలను కప్పిపుచ్చుకునేందుకే...

అనకాపల్లి : విశాఖ స్టీల్ ప్లాంట్ కార్మికులపై చంద్రబాబు చేసిన విమర్శలు అత్యంత హేయమైనవని సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ పేర్కొంది. ఆ వాఖ్యలను ఖండిస్తూ పార్టీ జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు.

దేశ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తున్న ఉక్కు కార్మికులను 'పని చేయని వారు', 'తెల్ల ఏనుగులు' అంటూ అవమానించడం యావత్ వర్గాన్ని దూషించే చర్యే అని మండిపడ్డారు. దశాబ్దాలుగా ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తున్న వేలాది మంది ఉక్కు కార్మికుల కష్టాన్ని, త్యాగాన్ని గుర్తించకుండా ముఖ్యమంత్రి స్థాయి వ్యక్తి ఇలాంటి చౌకబారు వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు.

సమ్మిట్‌లో సన్ ఇనిస్టిట్యూట్ ఎంఒయు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి మండలి, సన్ ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ మేనేజ్‌మెంట్ మధ్య శుక్ర, శనివారాల్లో ఏయు వేదికగా జరిగిన సిఐఐ భాగస్వామ్య సదస్సులో ఒక ముఖ్యమైన అవగాహన ఒప్పందం జరిగింది. దీని ప్రకారం సన్ ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ మేనేజ్‌మెంట్ సంస్థ విశాఖపట్నం నగరం, జిల్లాలో రూ.150 కోట్లకుపైగా పెట్టుబడితో ఒక మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ హోటల్ ప్రాజెక్టును ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. ఈ పర్యాటక ప్రాజెక్ట్‌లో సంస్థ కనీసం రూ. 150 కోట్ల పెట్టుబడికి కట్టుబడి ఉంది. తద్వారా సుమారుగా 2000 మందికి ఉపాధి లభిస్తుందని అంచనా వేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి మండలి ఈ ప్రాజెక్ట్ అభివృద్ధికి అవసరమైన అన్ని అనుమతులు /అధికృత పత్రాలు/క్లియరెన్స్‌లను సంబంధిత శాఖల నుండి వేగంగా పొందడంలో సంస్థకు సహకరిస్తుంది. ఈ అవగాహన ఒప్పందం మూడు సంవత్సరాల కాలానికి చెల్లుబాటు అవుతుంది. ఈ ఒప్పందంపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరపున ఆంధ్రప్రదేశ్ ఆర్థికాభివృద్ధి మండలి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, సన్ ఇంటర్నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ మేనేజ్‌మెంట్ తరపున ఛైర్మన్ జాస్తి శ్రీకాంత్ సంతకం చేశారు.

ఒప్పంద పత్రాలతో సన్ ఇనిస్టిట్యూట్ ప్రతినిధులు

సందడిగా ప్రెసిడెన్షియల్ స్కూల్ వార్షికోత్సవం

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: ప్రెసిడెన్షియల్ స్కూల్ తమ వార్షిక దినోత్సవాన్ని 'ఒడిస్సీ 2025 ఎక్స్‌ప్లోరింగ్ న్యూ హారిజన్స్' అనే థీమ్‌తో ఆదివారం కళాభారతిలో వైభవంగా నిర్వహించింది. కార్యక్రమానికి ఐఎన్ఎస్ కళింగ కమాండింగ్ ఆఫీసర్ కమాండర్ అనిరుద్ధరాయ్ విశిష్ట అతిథి, సెంచూరియన్ విశ్వవిద్యాలయం కులపతి జి.ఎస్.ఎన్.రాజు అతిథి, హిందూస్తాన్ షిప్‌యార్డ్ లిమిటెడ్ మాజీ ఛైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ హేమంత్ ఖత్రి ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. విద్యార్థులు దేశ సమైక్యత కోసం పాటుపడాలని, దేశ అభివృద్ధికి సేవ చేయాలని ప్రేరేపించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

IN THE HONOURABLE COURT OF XI ADDITIONAL DISTRICT JUDGE AT VISAKHAPATNAM
G.O.P.15/2025

IN THE MATTER OF GUARDIANSHIP CERTIFICATE OF NAIDANA SURYA PRAKASH S/O NAIDANA APPA RAO

BETWEEN :
Naidana Gowri Shankar ...PETITIONER
AND :
1.Naidana Appa Rao
2.Naidana Padmapriya
...RESPONDENTS

GENERAL NOTICE

Please take notice that the above matter has been filed by the Petitioner seeking the grant of a **Guardianship Certificate** in respect of **Sri Naidana Surya Prakash**, who is suffering from mental retardation since his birth. The Petitioner has been taking care of Sri Surya Prakash since the demise of their mother. Accordingly, the Petitioner seeks to be appointed and recognized as the **legal guardian** of Sri Surya Prakash for the purpose of managing and safeguarding all his personal and property interests.

In this regard, whoever has objections should appear in the above court in person or by a pleader duly instructed and able to answer all material questions relating to the matter on **01-12-2025 at 10:30** am and in default of any such appearance, the matter shall be heard and determined accordingly.

B.Kusuma Sree, Advocate
Door No.9-41-19/5, Neha Enclave
Pithapuram Colony, Maddilapalem
Visakhapatnam-530003
Mobile:9948165556

రెయిన్‌బో హాస్పిటల్ ఆధ్వర్యంలో వాక్‌థాన్

ప్రజాశక్తి- ఎంవిపికాలనీ: ప్రపంచ ప్రీమెచ్యూరిటీ దినోత్సవం సందర్భంగా, రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్, బర్త్ రైట్ బై రెయిన్‌బో సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం విశాఖపట్నంలో ప్రీమెచ్యూరిటీపై అవగాహన కల్పించడానికి రామకృష్ణ బీచ్ కాళీమాత ఆలయం నుండి వైఎంసిఏ వరకూ వాకథాన్ నిర్వహించారు. వాకథాన్‌లో ప్రజాప్రతినిధులు సహా 600 మందికి పైగా ఉత్సాహంగా పాల్గొన్నారు. రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ కన్సల్టెంట్ నియోనాటాలజిస్ట్ డాక్టర్ వినయ్ మాట్లాడుతూ, 'ముందస్తుగా జన్మించిన శిశువులు చాలా బలహీనంగా ఉంటారు, వారికి ప్రత్యేకమైన సంరక్షణ అవసరం అటువంటి సదుపాయాలు అన్నీ రెయిన్‌బోలో ఉన్నాయన్నారు. ఈ వాకథాన్‌లో డాక్టర్ వినయ్, ఏపి రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్, టిఎస్ జోనల్ డైరెక్టర్ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తెలుగు భాషపై ప్రభుత్వ కుట్రలు ఆపాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: తెలుగు భాషపై కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలను వ్యతిరేకించాలని తెలుగుదండు అధ్యక్షుడు పరవస్తు ఫణిశయన సూరి పిలుపునిచ్చారు. తెలుగుదండు ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిర్వహిస్తున్న 'ఠిట్టిభ సత్యాగ్రహం ఆదివారం నాటికి ఏడో రోజుకు చేరుకుంది. తెలుగుభాష రక్షణ కోసం చేపట్టిన నిరవధిక నిరాహార దీక్షలో పలువురు సాహితీవేత్తలు, కళాకారులు, పాల్గొని మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఫణిశయనసూరితో పాటు పలువురు వక్తలు మాట్లాడుతూ గత ప్రభుత్వం అన్ని పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమాన్ని ప్రవేశపెట్టి విద్యార్థులను రెంటికీ చెడ్డ రేవడులను చేసిందని అప్పట్లో విమర్శించిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు పాఠశాల విద్యనే సర్వనాశనం చేస్తోందని దుయ్యబట్టారు. యుద్ధప్రాతిపదికన, అధికార భాషాసంఘాన్ని ఏర్పాటు చేయాలని, సుప్రీంకోర్టులో ఉన్న ఆంగ్లమాధ్యమ వ్యాజ్యాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని, ప్రాథమిక విద్యాబోధన తెలుగులోనే నిర్వహించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

వన భోజనాలకు భీమిలి ఆహ్వానం

- సహజ సిద్ధ అందాలు..
- సింధూరపు రాసుల్లా ఎర్ర మట్టి దిబ్బలు..
- ఆహ్లాదం కలిగించే పార్కులు..

భీమిలి తీరంలో ఉన్న సాగరకన్య

భీమిలి లైట్ హౌస్

ప్రజాశక్తి -భీమునిపట్నం : కార్తీకానికి భీమిలి ఆహ్వానం పలుకుతోంది. నింగిని తాకాలన్న ఉత్సాహంతో ఉవ్వెత్తున ఎగిసిపడే కెరటాలు, ఆంధ్రా నుదుట తిలకం దిద్దినట్లు గోచరించే, ఆసియా ఖండంలోనే సింధూరపు రాసుల వలే అరుదైన ఎర్రమట్టి దిబ్బలు, సహజ సౌందర్యాన్ని పరుచుకున్న తీరం.. చారిత్రక భీమిలి సొంతం. ఇక్కడి ఇసుక తిన్నెలు కార్తీకానికి వచ్చే సందర్శకులకు సాదరంగా ఆహ్వానం పలుకుతున్నాయి. సహజ సిద్ధ సోయగాలతో ప్రకృతి ప్రసాదించిన అందాల భీమిలికి కార్తీక సందడి వచ్చింది. వన భోజనాల కోసం జనం తరలి వస్తున్నారు. ఈ నేపథ్యంలో అక్కడ ఏయే విహార కేంద్రాలు ఉన్నాయో ఓ సారి తెలుసుకుందాం.

ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే కాకుండా గోదావరి, ఒడిశా తదితర ప్రాంతాల నుంచి అత్యధికంగా తరలి వచ్చే సందర్శకులతో భీమిలి ప్రాంతం ఏటా కిట కిట లాడుతోంది.

సింధూరాన్ని పోలే ఎర్రమట్టి దిబ్బలు..

ఓ వైపు నురగల నవ్వులు నవ్వుతూ, రా రమ్మని పిలుస్తూ సంబరంగా కనిపించే సముద్రం.. మరో వైపున పూల గుత్తుల సిగలో తరుముకున్న చందాన అందచందాలతో అబ్బుర పరిచే ప్రకృతి సౌందర్యం.. ఈ సోయగాల ఆస్వాదంలో సర్వం మరిచిపోయి, ఎటెటో ప్రయాణిస్తూ ఉంటే, ఎదురుగా సింధూరం రాశులు పోసినట్టు ఎర్ర మట్టి గుట్టలు దర్శనమిస్తాయి.

ఆహ్లాదం పంచే పార్కులు..

స్థానిక బీచ్‌లో ఉన్న పలు పార్కులు ఆహ్లాదాన్ని పంచేలా ఉన్నాయి. లైట్ హౌస్‌కు కొద్ది దూరంలో ఉన్న బుద్ధుని విగ్రహం, సముద్రం ఒడ్డున రాళ్లపై సాగర కన్య విగ్రహం, పార్కులో మత్స్యకారుని విగ్రహం, ఐ లవ్ యు భీమిలి లోగో, మహాత్మా గాంధీ, పొట్టి శ్రీరాములు, గోకుల్ పార్కు, భీమిలి చిన్న బజారు సమీపంలో జమ్మి చెరువు పార్కు, సందర్శకులను ఎంతగానో ఆకర్షిస్తున్నాయి. పార్కుల్లో చుట్టూరా పచ్చ దనం నింపే పచ్చని గడ్డి ఉండనే ఉంది. అక్కడక్కడ చెట్లు నీడన వన భోజనాలు చేస్తుండడం కనిపిస్తోంది.

అహ్లాదం కలిగిస్తున్న పొట్టి శ్రీరాములు పార్కు

నేరాలు ఘోరాలు

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలో దేవవరం గ్రామ శివారులో ఆదివారం పేకాట శిబిరంపై దాడి చేసినట్లు ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. 6 గురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసి, వారి వద్ద నుండి రూ.6070 లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఎవరైనా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. నిరంతరం నిఘా ఉంటుందన్నారు.

వివాహిత అదృశ్యం

ప్రజాశక్తి -తగరపువలస : భీమిలి పోలీసు స్టేషన్ పరిధిలో వివాహిత అదృశ్యమైనట్లు కేసు నమోదైంది. దివీస్ ఫార్మా కంపెనీలో పనిచేస్తున్న వీరవల్లి ప్రసన్నకుమార్ (32) భార్య టి.నందిని (21), వీరి ఆరు నెలల బాబుతో కలిసి తగరపువలస టీచర్స్ కాలనీలో నివాసముంటున్నారు. గత నెల 14వ తేదీ మధ్యాహ్నం ప్రసన్నకుమార్ డ్యూటీకి వెళ్లి రాత్రి 11గంటలకు ఇంటికి వచ్చారు. బాబు ఉయ్యాలో ఉన్నాడు. భార్య కనిపించక పోవడంతో పరిసర ప్రాంతాల్లో వెతికారు. బంధువులకు తెలియజేసినప్పటికీ ఎటువంటి ఆచూకీ లభించలేదు. దీంతో ప్రసన్నకుమార్ భీమిలి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎస్ఐ భరత్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పార్వతికి నివాళి

ప్రజాశక్తి -గాజువాక : జివిఎంసి 76వ వార్డు పరిధిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులు మంద పార్వతి ఆదివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (సిఐటియు) నాయకులు గొలగాని అప్పారావు, వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ తాతారావు ఆమె ఇంటికి చేరుకొని భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. ఈ ఏడాది జులై నుండి నవంబర్ వరకు కాంట్రాక్టు, ఆప్కాస్ పారిశుధ్యం కార్మికుల మొత్తం ఆరుగురు మృతిచెందారని, ఆయా కుటుంబాలకు నేటికీ దహన సంస్కార ఖర్చులను జివిఎంసి చెల్లించలేదని గొలగాని అప్పారావు పేర్కొన్నారు.

జగన్మోహన్‌రెడ్డిని కలిసిన పోతిన ప్రసాద్

6వ వార్డు వైసిపి అధ్యక్షునిగా పోతిన ప్రసాద్

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 6వ వార్డు వైసిపి అధ్యక్షునిగా అనూష కేటరింగ్ అధినేత పోతిన ప్రసాద్‌ను నియమించారు. ఈ సందర్భంగా పోతిన ప్రసాద్ మాట్లాడుతూ, ఈ బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్‌రెడ్డికి, భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావుకు, సిరి సహస్రకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి నిరంతరమూ కృషిచేస్తానని చెప్పారు.

దేవాలయాలకు సిమెంట్ బెంచీల వితరణ

ప్రజాశక్తి- తగరపువలస : కన్నారావు మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ సేవా కార్యక్రమంలో భాగంగా తగరపువలస ప్రాంతంలోని వివిధ దేవాలయాలకు సుమారు ఇరవై సిమెంట్ బెంచీలను విరాళంగా అందించారు. ట్రస్ట్ అధ్యక్షులు రంగూరి సీతారామదొర (రాంబాబు) ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. చిట్టివలస, తగరపువలస దేవాలయాలలో భక్తులు కూర్చునేందుకు వీలుగా ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో ఎస్.రాంప్రసాద్, పాపారం కుమార్, ఎర్నింటి వెంకటరావు, పరిమి అప్పలరాజు, మేకల శ్రీను పాల్గొన్నారు.

'అనంతుని' దీపోత్సవానికి ఏర్పాట్లు

ప్రజాశక్తి -పద్మనాభం : పద్మనాభంలో ఈ నెల 19వ తేదీన నిర్వహించే అనంత పద్మనాభ స్వామి దీపోత్సవ కార్యక్రమానికి అధికారులు చురుగ్గా ఏర్పాట్లు చేస్తున్నారు. ఘాట్ రోడ్ నిర్మాణం పూర్తి కావడంతో రోడ్డు మార్గంలో వారం రోజులుగా విద్యుత్ సౌకర్యం పనులు చేస్తున్నారు స్థానిక ఎంపిపి కె.రాంబాబు చొరవతో ఘాట్ రోడ్డులో భక్తుల సహకారంతో లైట్లు ఏర్పాటు చేశారు. మెట్లు మార్గంలో కూడా విద్యుత్ లైట్లు సమకూర్చారు. రోడ్డుకిరువైపులా నాలుగు అడుగుల వెడల్పున తుప్పలు తొలగించారు. మెట్లు శుభ్రపరిచి సున్నం వేశారు. రోడ్డు మార్గంలో ఎటువంటి ప్రమాదాలూ జరగకుండా రక్షణ స్తంభాలు ఏర్పాటు చేశారు. కొండపై భాగంలో వికలాంగులు, వృద్ధులు సుమారు 60 మెట్లు వరకు నడిచి వెళ్లేలా ఏర్పాటు చేశారు. కొండ చివర భాగంలో వాహనాలు నిలిపేందుకు ప్రత్యేక స్థలాన్ని ఏర్పాటుచేశారు. కొండ దిగువన ఉన్న కుంతీ మాధవ స్వామి ఆలయంలోనూ భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు ఏర్పాట్లు చేశారు.

సింహాచలం నుండి వచ్చిన రోడ్డు మార్గంలో గ్రామానికి సుమారు కిలోమీటర్ దూరంలో మద్ది చెరుకు కాటా, బోని జంక్షన్, అనంతవరం జంక్షన్ సమీపంలో వాహనాలు నిలిపి ఉంచడానికి అధికారులు సిద్ధం చేశారు. తగరపువలస నుండి పద్మనాభం రావడానికి వెంగమాంబ క్వారీ స్ప్రింగ్ ఫీల్డ్ ప్రైవేట్ పాఠశాల ప్రాంతాల్లో వాహనాలు నిలిపేందుకు స్థలం సమకూర్చారు. విజయనగరం నుండి పద్మనాభం రావడానికి రెడ్డిపల్లి లే-అవుట్, అనంత పద్మనాభ స్వామి మామిడి తోట, రహదారి బంగాళా ప్రాంతాల్లో వాహనాలు నిలిపేందుకు ఏర్పాటుచేశారు. ఈ దీపోత్సవానికి భక్తులు రావడానికి బస్సు సౌకర్యం కూడా ఏర్పాటు చేశారు. దీపోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు కాటన్ వస్త్రాలు ధరించి రావాలని, దీపాలను వెలిగించే సందర్భాల్లో వ్యక్తిగత భద్రతను పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని ఆలయ అధికారులు సూచించారు. పరిసరాలను గమనిస్తూ కొండపైకి వెళ్లాలని సూచించారు. భక్తులు సమన్వయం పాటిస్తూ తోటి వారికి సహకరించాలని కోరారు. దేవాదాయ, పోలీస్ శాఖ అధికారులు ఇచ్చే సూచనలను భక్తులు తప్పనిసరిగా పాటించాలని కోరారు.

జూ పార్కును సందర్శించిన కాంతిలాల్ దండే

ప్రజాశక్తి - ఆరిలోవ : ఇందిరాగాంధీ జంతు ప్రదర్శన శాలను, కంబాల కొండను పర్యావరణ, అటవీ, విజ్ఞాన, సాంకేతిక శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కాంతిలాల్ దండే ఆదివారం అటవీశాఖ సంరక్షకులు బి.మహ్మద్ దివాన్‌తో కలిసి సందర్శించారు. కంబాలకొండలో నూతనంగా అభివృద్ధి చేసిన క్యాఫెటీరియా, అంఫి థియేటర్, అదనంగా అప్‌గ్రేడ్ చేసిన కాటేజీలు, పర్యావరణహిత కాటేజీలు, వాచ్‌టవర్, యోగా థియేటర్, ఉడెన్ డెక్, ప్రశాంతమైన శాంతివనాలను పరిశీలించారు. అనంతరం జూ పార్కును సందర్శించారు. జూ పార్కులో జంతు సంపద, వెటర్నరీ సంరక్షణ సౌకర్యాలు, జూలో జరుగుతున్న ఎడ్యుకేషన్ కార్యక్రమాలు, సందర్శకుల అనుభవాలు, జూ చేపడుతున్న అభివృద్ధి గురించి జూ క్యూరేటర్ జి.మంగమ్మ ఆయనకు వివరించారు. ఈ సందర్భంగా కాంతిలాల్ దండే మాట్లాడుతూ, జూ పార్కును ప్రధాన పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో జూ పార్కును మార్చేందుకు సమగ్ర అభివృద్ధి, ప్రణాళికను త్వరలో సిద్ధం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జూ పార్కులో ఎన్‌క్లోజర్లను పరిశీలిస్తున్న అటవీశాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కాంతిలాల్ దండే

జూ పార్కు ఒక్క రోజు ఆదాయం రూ.8.2 లక్షలు

కార్తీకమాసం సందర్భంగా ఆదివారం జూ పార్కును 11,099 మంది సందర్శించారు. వీరి నుంచి రూ.8.2 లక్షల ఆదాయం సమకూరినట్టు జూ క్యూరేటర్ జి.మంగమ్మ తెలిపారు.

ఎన్ఎస్ఎస్ ముగింపులో మాట్లాడుతున్న అతిథులు

ముగిసిన ఎన్ఎస్ఎస్ శిబిరం

ప్రజాశక్తి-ఆనందపురం : మండలంలోని గుడిలోవ ఎక్కుజె కళాశాల ఆధ్వర్యాన నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక ముగింపు కార్యక్రమం ఆదివారం దత్తత గ్రామమైన పాలవలసలో నిర్వహించారు. వారం రోజుల పాటు గ్రామంలో సేవ, అవగాహన, శ్రమదానం వంటి కార్యక్రమాలు చేపట్టారు. ముగింపు కార్యక్రమానికి కళాశాల డైరెక్టర్ పి.సుధారాణి మాట్లాడుతూ, యువత సామాజిక బాధ్యతతో ముందుకు రావడం అభినందనీయమన్నారు. అనంతరం వివిధ క్రీడా పోటీల్లో విజయం సాధించిన పాఠశాల విద్యార్థులకు, కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్న స్థానిక మహిళలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రతినిధి సన్యాసిరావు, ఎంపియుపి స్కూల్ హెడ్‌మాస్టర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ పవన్ కుమార్ పాల్గొన్నారు.

ప్రమాణస్వీకారం చేస్తున్న 1వ వార్డు టిడిపి కమిటీ సభ్యులు

ఒకటో వార్డు టిడిపి అధ్యక్షునిగా తమ్మిన

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి 1వ వార్డు టిడిపి అధ్యక్షునిగా తమ్మిన సూరిబాబు నియమితులయ్యారు. ప్రధాన కార్యదర్శిగా దంతి వెంకటేష్, ఉపాధ్యక్షులుగా దొంతల పైడిరాజు, సహ కార్యదర్శులుగా సరగడ నరసింగరావు, ఎర్రినింటి వెంకటరావు, తమ్మిన సూర్య ప్రకాష్, కార్యదర్శులుగా కోసూరి రాంబాబు, గిడుతూరి శ్రీను, రేసు రమణ, కుమిలి తిరుపతిరావు నియమితులయ్యారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకు కమిటీ సభ్యులు ధన్యవాదాలు తెలియజేశారు.

సంగీత, సాహిత్యంలో సిరివెన్నెలది అందెవేసిన చేయి

ప్రజాశక్తి- సీతమ్మధార : సంగీత, సాహిత్యాలలో సిరివెన్నెల సీతారామశాస్త్రిది అందె వేసిన చేయి అని సిరివెన్నెల సాహితీ మిత్రులు చెరుకువాడ సత్యనారాయణ అన్నారు. 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విశాఖ పౌర గ్రంథాలయంలో విశాఖ రసజ్ఞ వేదిక ఆధ్వర్యాన సిరివెన్నెల సీతారామశాస్త్రి సినీయేతర సాహిత్యంపై ప్రసంగ కార్యక్రమం నిర్వహించారు. సత్యానంద్ ప్రార్థనా గీతం సిరివెన్నెల రచించిన 'ఆది భిక్షువు వాడినేది కోరేది' అనే పాటతో సభ ప్రారంభమైంది. అనంతరం చెరుకువాడ సత్యనారాయణ మాట్లాడుతూ, ఎవరికి తెలియని సిరివెన్నెల పాటలు కొన్ని ఉన్నాయన్నారు. సంగీతం అతని ఊపిరి, సాహిత్యం అతని బలం అన్నారు. 16వ సంవత్సరంలో రచన మొదలుపెట్టి, వ్యాసాలు, గేయాలు రాసారని తెలిపారు. 1972 నుండి 1883 వరకు ఇతర రచనలు చేశారన్నారు. సినిమా కవులకు సాహితీ చరిత్రలో స్థానం ఉండదన్నారు. కానీ సిరివెన్నెల మంచి సాహిత్యం రాసిన పుస్తకాలు ఉన్నాయన్నారు. అలసిపోయిన ఆనందం కలిగిన, ఆవేదన కలిగిన పాటే అతని నుండి వస్తుందన్నారు. భారతదేశంపై అతని రాసిన గేయాలను ఉదహరించారు. "సమాజమెందుకని" అను సిరివెన్నెల పాట ప్రత్యేకతను వివరించారు. తర్వాత దేశ భక్తి గీతాలు ఆలపించారు. సభాధ్యక్షులు డాక్టర్ గండికోట రఘురామారావు మాట్లాడుతూ, గ్రంథాలయ వారోత్సవాలు ముఖ్యోద్దేశ్యాన్ని వివరించారు. పుస్తకం చదవడంలో గల అవసరాన్ని సభకు తెలియజేశారు. సిరివెన్నెల సామాజిక స్పృహ ఉన్న కవి అని చెప్పారు. ఆచార్య ప్రయాగ రామకృష్ణ మాట్లాడుతూ, సిరివెన్నెలతో తనకు గల స్నేహంతో 1980 నాటి సిరివెన్నెల జీవిత వివరాలను సభ ముందుంచారు. నిత్యం జ్వలించే కవి సిరివెన్నెల అని అభివర్ణించారు. ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ డి.వి.సూర్యారావు మాట్లాడుతూ, పౌర గ్రంథాలయ వారోత్సవాలను వివరించారు. సినీ పాటకు ప్రత్యేక స్థానాన్ని కల్పించింది సిరివెన్నెలే అన్నారు.

రైతు కష్టంపై ప్రదర్శన

ప్రజాశక్తి -గాజువాక : పంటలు పండించే రైతు పడే కష్టాలను తెలియజేసేలా దయాల్‌నగర్‌లో ఏర్పాటుచేసిన ప్రదర్శన అందరికీ ఆకట్టుకుంది. అనంతరం దయాల్‌నగర్ గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో గౌరీ పరమేశ్వరుల ఉత్సవాల్లో భాగంగా 7 వేల మందికి ఆదివారం అన్న సమారాధన ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, బొడ్డు నరసింహ పాత్రుడు, నాయకుడు పల్లా రమణ పాల్గొన్నారు.

నాపై ఆరోపణలు అవాస్తవం : సుందరపు

ప్రజాశక్తి-సీతమ్మధార : భూ దందాలో తనపై వస్తున్న ఆరోపణలు అవాస్తమని యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. పౌర గ్రంథాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, యలమంచిలి నియోజకవర్గంలో ఒక్క అవినీతి పని కూడా తాను గానీ, తన కుటుంబ సభ్యులు గానీ చేయలేదని చెప్పారు. తనపై తప్పుడు కథనాలు ప్రచురిస్తున్న వారిపై న్యాయపరంగా ముందుకు వెళ్తానని తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుండి నియోజకవర్గ అభివృద్ధి కోసం కృషి చేస్తున్న తనపై ఇలాంటి ఆరోపణలు చేయడం సరికాదన్నారు.

శివ జ్యోతి రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి -గాజువాక : శివ జ్యోతి రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఆదివారం ఎన్నికైంది. అధ్యక్షులుగా వై.వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా పరిటాల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా ఆకుల శ్రీనివాసరావు, ఉప కార్యదర్శిగా అఖిల కృష్ణ, సంయుక్త కార్యదర్శులుగా దండు పెద్దిరాజు, ఎ.రఘురామ్, కోశాధికారిగా ఎస్.శ్రీనివాసరాజు, మహిళా కార్యదర్శిగా శ్రీవాణి, 19 మంది సభ్యులతో నూతన కార్యవర్గం ఎన్నికైంది.

అయ్యన్న దిగజారుడు మాటలు వెనక్కి తీసుకోవాలి : ఐద్వా

ప్రజాశక్తి-సీతమ్మధార : శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు తన వయసు, స్థాయిని మరిచి మాట్లాడిన దిగజారుడు వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలని ఐద్వా విశాఖ జిల్లా కమిటీ డిమాండ్‌చేసింది. ఈ మేరకు ఐద్వా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆర్ఎన్.మాధవి, వై.సత్యవతి ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖలో టూరిజం అభివృద్ధి చెందాలంటే జూదం, మద్యం, పబ్బుల కల్చర్ పెరగాలని, గోవా తరహా సంస్కృతి ఇక్కడికి రావాలని శనివారం ఒక బహిరంగ సభలో ఆయన చెప్పడం సిగ్గుచేటు అని పేర్కొన్నారు. గౌరవప్రదమైన పదవిలో ఉంటూ విచ్చలవిడి సంస్కృతిని ప్రోత్సహించేలా, యువతను తప్పుదారి పట్టించేలా మాట్లాడి ఆ పదవికి కళంకం తీసుకుని రావడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. ప్రశాంతంగా ఉండే విశాఖపట్నంలో టూరిజం పేరుతో ఇటువంటి విశృంఖలత్వాన్ని పెంచి పోషించడానికి ప్రజలు అధికారం కట్టబెట్టారని మీరు అనుకుంటున్నారా అని ప్రశ్నించారు. 'గోవా కల్చర్ నచ్చితే మీరు అక్కడికే వెళ్లి ఉండండి. అంతే కానీ ప్రమాదకరమైన ఆ సంస్కృతిని ఇక్కడకు తీసుకొస్తే మాత్రం ప్రజానీకం చూస్తూ ఊరుకోరు' అని హెచ్చరించారు.

జెండాను ఆవిష్కరిస్తున్న కెవిపిఎస్ నాయకులు

సత్యసాయి సంస్థల సేవలు గొప్పవి: సిపి

నిత్యావసరాలను అందిస్తున్న పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చీ

ప్రజాశక్తి -గాజువాక : తాగునీరు, విద్య, వైద్య రంగాల్లో సత్యసాయి ట్రస్టు చేస్తున్న సేవలు గొప్పవని విశాఖ నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చీ అన్నారు. సత్యసాయి శతవర్ష జన్మదినోత్సవ వేడుకలు పెదగంట్యాడ వెంపళ్లనగర్‌లో పెదగంట్యాడ సమితి, వెంపళ్ల నగర్ భజన మండలి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా 400 మంది నారాయణులకు 40 రకాల నిత్యావసర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా పోలీసు కమిషనర్ మాట్లాడుతూ సామాజిక సేవ అన్నది సత్యసాయి ఆలోచన నుంచి పుట్టుకొచ్చిందన్నారు. ఆయన చూపిన మార్గంలో దేశవ్యాప్తంగా ఉన్న సత్యసాయి భక్తులు పేదలకు అనేక సేవలు అందిస్తున్నారని కొనియాడారు. మానవ సేవ అన్నింటికన్నా గొప్పదని పేర్కొన్నారు. శంకర్ సాయిరాం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చింతలపూడి వెంకటరామయ్య, కార్పొరేటర్లు తిప్పల వంశీరెడ్డి, చందు, టిడిపి నేత పల్లా రమణ, సిబలు శ్రీనివాస్, కామేశ్వరరావు, సమితి కన్వీనర్ బీరా బాబూరావు, భజన మండలి కన్వీనర్ కొండబాబు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందాం: కెవిపిఎస్

ప్రజాశక్తి -గాజువాక : భారత రాజ్యాంగాన్ని కాపాడుకుందామని కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు కె.సుబ్బన్న పేర్కొన్నారు. కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వడ్లపూడిలో కెవిపిఎస్ సీనియర్ నాయకులు సాధూరావు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారత రాజ్యాంగానికి ఏర్పడిన ముప్పును ఎదుర్కోడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం సామ్యవాదం, లౌకిక ప్రజాస్వామ్య, గణతంత్ర లక్ష్యాలతో అన్ని వర్గాల ప్రజలకు అనుకూలంగా ఉందన్నారు. రాజ్యాంగం విచ్ఛిన్నం అయితే, బలహీన వర్గాలు, శ్రామికులు, కార్మికులు నష్టపోతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టీల్ డివిజన్ కెవిపిఎస్ నాయకులు సూరప్పారావు, సరోజిని, ఇమాన్యుయేలు, సిఐటియు నాయకుల వీరస్వామి, వడ్లపూడి దళితులు పాల్గొన్నారు.

వైసిపి ఐటి వింగ్ విశాఖ అధ్యక్షునిగా గణేష్

కె.కె.రాజును కలిసిన ఐటి వింగ్ అధ్యక్షుడు గణేష్

ప్రజాశక్తి-సీతమ్మధార : వైసిపి ఐటి వింగ్ విశాఖపట్నం జిల్లా అధ్యక్షునిగా మేరువ గణేష్, 55వ వార్డు వైసిపి అధ్యక్షులుగా యర్రంశెట్టి శ్రీనివాసరావు నియమితులయ్యారు. వారిని ఉత్తర నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షులు కె.కె.రాజు ఆదివారం సత్కరించారు. ఈ సందర్భంగా కె.కె.రాజు మాట్లాడుతూ, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో 55వ వార్డు కార్పొరేటర్ శశికళ, నాయకులు పాల్గొన్నారు.

వైసిపి సంతకాల సేకరణ

ప్రజాశక్తి-సీతమ్మధార : ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి 45వ వార్డు పరిధి తాటిచెట్లపాలెం హైవే బస్సు స్టాప్ వద్ద కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. వార్డు వైసిపి అధ్యక్షుడు పైడి రమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు కె.కె.రాజు పాల్గొని విద్యార్థులు, మేధావులు, ప్రజలు నుండి సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో హరి పట్నాయక్, ఎం.సునీల్, ఎం.గోపి, సన్నీ, సతీష్, నానిబాబు, నాయుడు, గణపతి, సత్యానందరెడ్డి, వేణు, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

జివిఎంసి 54వ వార్డు పరిధి గజపతినగరంలో వార్డు అధ్యక్షుడు కడితి చిరంజీవి ఆధ్వర్యంలో సంతకాలు సేకరించారు. ఈ కార్యక్రమంలో కె.కె.రాజు, బాకీ శ్యామ్ కుమార్ రెడ్డి, ఎం.సునీల్, రాధాకృష్ణ, అచ్యుతరావు, కల్యాణ్, రవణమ్మ, దిలీప్, వి.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : పరవాడ మండలం తానాంలో వైసిపి ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ, రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. పరవాడ జెడ్‌పిటిసి పి.ఎస్ రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో అనకాపల్లి పార్లమెంట్ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్, పెందుర్తి నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్, రాష్ట్ర కార్యదర్శి మాడుగుల, పాయకరావుపేట నియోజకవర్గ పరిశీలకులు పైల శ్రీనివాసరావు, వైస్ ఎంపిపి బంధం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : ప్రభుత్వ వైద్యకళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా మల్లవరం గ్రామంలో వైసిపి జిల్లా కార్యదర్శి పిన్నమరాజు రవీంద్రరాజు ఆధ్వర్యంలో కోటి సంతకాల సేకరణ చేపట్టారు.

330 మందికి నేత్ర వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 58 వార్డు పరిధి ములగాడలో కోరమాండల్ సౌజన్యముతో ఉచిత నేత్ర శిబిరం నిర్వహించారు. కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ యూనిట్ హెడ్, వైస్ ప్రెసిడెంట్ సిహెచ్.శ్రీనివాసరావు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సుమారు 330 మందికి వాసవి ఐ కేర్ వైద్యులు నేత్ర వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి కంటి అద్దాలు, శస్త్ర చికిత్స చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కోరమాండల్ ప్రతినిధి కెవిబివై.ఎస్.నారాయణ, ములగాడ గ్రామ అధ్యక్షులు ధర్మాల వేణు గోపాలరెడ్డి,

వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సంస్థ హెడ్ సిహెచ్.శ్రీనివాసరావు

గురుబిల్లి రామచంద్రరెడ్డి, పట్నాల నారాయణరెడ్డి, గురుబిల్లి రమణారెడ్డి పాల్గొన్నారు.

శ్యామ్‌బాబుకు జ్ఞాపికను అందిస్తున్న చంద్రబాబు

శ్యామ్‌బాబుకు సిఎం అభినందనలు

ప్రజాశక్తి-సీతమ్మధార : ఆంధ్ర యూనివర్సిటీలో జరిగిన సిఐఐ పార్టనర్ షిప్ సమ్మిట్ విజయవంతం అవడానికి కృషి చేసిన సందర్భంగా ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ శ్యామ్‌బాబును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అభినందించారు. మెమెంటో అందజేశారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సహాయం

బాధితులకు సరుకులు పంపిణీ చేస్తున్న నక్క లక్ష్మణరావు

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 59వ వార్డు పరిధి కొత్త నక్కవానిపాలెం ఏరియా శాంతిగిరి కాలనీ కొండపై శనివారం జరిగిన అగ్ని ప్రమాద బాధితులకు విశాఖ పార్లమెంట్ టిఎన్‌టియుసి అధ్యక్షులు నక్క లక్ష్మణరావు ఆధ్వర్యంలో సహాయం అందించారు. గురి సూర్యవతి, రమణ దంపతులు, పైలా వరలక్ష్మి, సత్తిబాబు దంపతులు ఒక్కో కుటుంబానికి 25 కిలోల చొప్పున బియ్యం, నిత్యావసర సరుకులు, రూ.6 వేలు చొప్పున సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో 59వ వార్డు టిడిపి క్లస్టర్ దొంకాన రాంబాబు, అధ్యక్షులు ఊరుకుటి హరిబాబు, ప్రధాన కార్యదర్శి మిత్తిరెడ్డి శంకర్, ఉపాధ్యక్షులు సుంకర అజయ్, తెలుగు యువత అధ్యక్షులు గుడివాడ అంజి, తెలుగు మహిళ ప్రధాన కార్యదర్శి పల్లా కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

సిఐటియు జాతీయ మహాసభల జయప్రదానికి విస్తృత ప్రచారం

కరపత్రాలను పంచుతూ ప్రచారం చేస్తున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి - కశింకోట : సిఐటియు 18వ అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ మండలం తేగాడ, గంటవానిపాలెం గ్రామాల్లో ఆదివారం కరపత్రాలను విస్తృత ప్రచారం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.శంకరరావు మాట్లాడుతూ సిఐటియు ఏర్పడి 55ఏళ్ల పూర్తయిన సందర్భంగా విభజిత ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారి, విశాఖ వేదికగా వచ్చే నెల 31 నుంచి జనవరి 4 వరకు వి మహాసభలు జరుగుతాయన్నారు దేశవ్యాప్తంగా 1500 మంది ప్రతినిధులు పాల్గొని,కేంద్ర ప్రభుత్వ కార్మిక ప్రజా వ్యతిరేక విధానాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తారన్నారు. జనవరి 4న భారీ బహిరంగ సభకు కార్మికలోకం తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో క్రెప్స్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఎ.అప్పారావు, కన్నబాబు, శ్రీను పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ ఫ్యాన్స్ ఔదార్యం



బాధిత కుటుంబానికి సాయం అందజేస్తున్న ఎన్‌టిఆర్ ఫ్యాన్స్

ప్రజాశక్తి -అచ్యుతాపురం : ప్రమాదంలో గాయపడిన చౌడపల్లి గ్రామం జంగాల కాలనీకి చెందిన టి ప్రసాద్ కుటుంబానికి ఆదివారం ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ప్రస్తుతం ప్రసాదు ప్రైవేట్ హాస్పిటల్లో ఐసీయూ విభాగంలో చికిత్స పొందుతున్నాడు. అతని కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న ఎన్టీఆర్ ఫ్యాన్స్ సభ్యులు ముందుకు వచ్చి బాధ్యత కుటుంబానికి రూ. 15వేలు సాయం చెక్కును అందజేశారు. కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు పుర్రె రవిచంద్రయాదవ్, అధ్యక్షులు ఎరిపల్లి ముత్యాలు, జాయింట్ సెక్రటరీ ఆడాడ చిన్న, క్యాషియర్ వసాది ఉదయభాస్కర్ పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

చెక్కులు అందిస్తున్న ఎమ్మెల్యే రాజు

ప్రజాశక్తి -చోడవరం : అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న పేదలకు ఆర్థిక చేయూతనివ్వడమే సిఎం సహాయనిధి లక్ష్యమనిస్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో 14 మంది బాధితులకు రూ. పది లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి జి వెంకట సత్యనారాయణ, టిడిపి పట్టణ అధ్యక్షుడు ఎర్రంశెట్టి చిన్న, సకురు కోటేశ్వరరావు, సిరిపురం రమేష్ పాల్గొన్నారు.

అనంతరం రోడ్లు బాగు చేయాలని స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆమ్ ఆద్మీ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్ష శిబిరం వద్దకు వెళ్లి మాట్లాడారు. రహదారుల మరమ్మతుల, పునర్నిర్మాణాలకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధమయ్యాయని వివరించి, దీక్ష నుంచి విరమింప చేశారు.

భారీ వాహన రాకపోకలతో అవస్థలు

• సిఐటియు ఆధ్వర్యాన దిబ్బపాలెం సెజ్ కాలనీ వాసుల నిరసన

రోడ్డుపై నిరసన వ్యక్తం చేస్తున్న దిబ్బపాలెం వాసులు

ప్రజాశక్తి అచ్యుతాపురం : సెజ్‌లోని దిబ్బపాలెం కాలనీ వీధుల్లో భారీ వాహనాల రాకపోకలను నియంత్రించాలని కోరుతూ ఆదివారం సిఐటియు ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. నిరంతరం వాహన రాకపోకలతో దుమ్ముధూళితో వాతావరణ కాలుష్యంతో రోడ్డు గుంతలమయమై పాడౌతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్ రాము, మండల కన్వీనర్ కె సోము నాయుడు మాట్లాడుతూ ఫార్మా కంపెనీల రసాయనిక వ్యర్థ కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్న నిర్వాసిత కాలనీవాసులకు ఇపుడు భారీ వాహనాల కాలుష్యం గుదిబండగా మారిందని మండిపడ్డారు. దుమ్ముధూళితో పిల్లలు, వృద్ధులు ఇబ్బందులు పడుతున్నారని, రోడ్డంతా గోతులమయమై, చినుకురాలితే నీటికుంటలను తలపిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యపై అనేకమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆందోళనలో లాలం సంజీవి, లాలం బుల్లి దొర, జి రమేష్, శ్రీను, శివ పాల్గొన్నారు .

వెంకటరమణకు పరవాడ టిడిపి పగ్గాలు

కన్నూరు వెంకటరమణ

ప్రజాశక్తి -పరవాడ : మండలం తానం గ్రామానికి చెందిన కన్నూరు వెంకటరమణకు టిడిపి మండల అధ్యక్ష పగ్గాలు వరించాయి. మూడు దశాబ్దాలుగా ప్రజాసేవలో అంకితభావంతో పనిచేస్తూ, అంచెలంచెలుగా ఎదిగారు. 1996లో పరవాడ మండల కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీగా రాజకీయంగా తొలి అడుగులేసిన వెంకటరమణ, 2005లో అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యుడిగా, 2006లోఎన్ఎస్‌యుఐ విశాఖ జిల్లా వైస్‌ప్రెసిడెంట్‌గా వ్యవహరించారు. 2009లో అనకాపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్‌గా,2006 -11 మధ్య ఐఎన్‌టియుసి విశాఖ జిల్లా కమిటీలో కీలకపాత్ర పోషించారు..2011లో పరవాడ మండల వైసిపి అధ్యక్షునిగా వ్యవహరించారు. 2014లో వెంకటరమణ సతీమణి కన్నూరు దేవి ఎంపిటిసిగా ఎన్నికయ్యారు. 2016లో గండి బాబ్జి సమక్షంలో టిడిపిలో చేరిన తరువాత, పార్టీ కార్యక్రమాలలో చురుకైన పాత్ర పోషించి, కేడర్‌ను సమీకరించడం లో ముందుండి పార్టీ పటిష్టతకు కృషి చేశారు. 2021లో తానాం గ్రామ సర్పంచ్‌గా ఎన్నికై గ్రామాభివృద్ధిలో తనదైన ముద్రవేసి ప్రజల్లో మంచి పేరు తెచ్చుకున్నారు. కార్మికసంఘం నాయకునిగా, సర్పంచ్‌గా, ఇతరత్రా ప్రజాప్రతినిధ్య పదవులను చేపట్టిన వెంకటరమణ, శ్రద్ధ, అంకితభావంతో పనిచేస్తూ ఆయా పదవులకు న్యాయం చేయడం ద్వారా ప్రజామన్ననలు పొంది నేడు టిడిపి మండల అధ్యక్ష పదవి చేపట్టే స్థాయికి ఎదిగారు.

బటర్ బీన్స్ కిలో @ రూ.300

• ధర ఎక్కువగా ఉన్నా కొనుగోలుకు వినియోగదారుల ఆసక్తి

• రుచి, ఆరోగ్యకరమైన ఆహారం కావడంతో మంచి డిమాండ్

మార్కెట్లో అమ్మకానికి వచ్చిన బటర్ బీన్స్

ప్రజాశక్తి- అనకాపల్లి రూరల్ : బటర్ బీన్స్ (తెల్ల చిక్కుడు పిక్కలు) కిలో రూ.300 పైగానే ధర పలుకుతుంది. ప్రస్తుతం మార్కెట్లో దీనికి గిరాకీ పెరిగింది. ధర పెరిగిన డిమాండ్ మాత్రం తగ్గలేదు. శీతాకాలంలో మాంసాహారానికి చాలామంది దూరంగా ఉండడం, ఇతర కాయగూరల ధరలు సైతం భారీగానే ఉన్న నేపథ్యంలో రుచి, ఆరోగ్యపరంగా ఎంతో శ్రేయస్కరమైన వీటి కొనుగోలు వైపు వినియోగదారులు మొగ్గు చూపుతున్నారని చెప్పొచ్చు.

శీతాకాలంలోనే మార్కెట్లలో కనిపించే ముఖ్యమైన కూరగాయల్లో బట్టర్ బీన్స్ ఒకటి. ఈ సీజన్‌లోనే ఎక్కువగా లభించే ఈ పచ్చి గింజలను ఏజెన్సీతోపాటు గ్రామీణ ప్రాంతాలలో పండించి, వాటిని పెద్ద ఎత్తున మార్కెట్లలోకి తరలించి విక్రయిస్తుంటారు. రుచికరమైన వంటకాలు చేయడానికి వీటిని వినియోగించి చుకుంటారు. బట్టర్ బీన్స్‌లో పోషకాలు ఎక్కువే. ప్రోటీన్, ఫైబర్, ఐరన్, ఫోలిక్ యాసిడ్, పొటాషియం అధికంగా ఉండటంతో ఆరోగ్యానికి కూడా మేలు. శీతాకాలంలో శరీరానికి అవసరమైన పోషకాలను సమతుల్యం చేయడంలో బట్టర్ బీన్స్ కీలక పాత్ర పోషిస్తాయని వైద్య నిపుణుల సూచన. బట్టర్ బీన్స్‌కు డిమాండ్ పెరగడంతో ధరలు కూడా విపరీతంగానే ఉంది. ప్రస్తుతం రిటైల్ మార్కెట్లో కిలో ధర రూ.300 వరకు పలుకుతోంది. జిల్లాలో కొండ ప్రాంతాల్లో సాగు చేసే రైతులకు ఈ సీజన్లో మంచి ఆదాయం వస్తోంది. గత ఏడాదితో పోల్చితే ధరలు ఈసారి కొంచెం ఎక్కువగా ఉండటంతో బీన్స్ పండించిన రైతులు సంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. సీజన్లో దొరికే సహజ రుచి కావున ధర పెరిగినా కొనకుండా ఉండలేమని పలువురు వినియోగదారులు అంటున్నారు. ఇతర కూరగాయల ధరలు కూడా ఎక్కువగానే ఉండడంతో, హోటళ్లు, కేటరింగ్ వాళ్లు కూడా అందరూ ఇష్టపడే ఈ బటర్ బీన్స్‌ను కొనుగోలు కు ఆసక్తి చూపుతున్నారంటే అతిశయోక్తి కాదు

కొత్తపాలెంలో కార్తీక వనసమారాధన

ప్రజాశక్తి - యలమంచిలి: మున్సిపాలిటీ పరిధి కొత్తపాలెం వార్డులో గాయత్రి పరివార్ ఆధ్వర్యంలో ఆదివారం కార్తీకహోమం నిర్వహించారు. వివేకానంద కాలేజీ అధినేత ఎవి రెడ్డినాయుడు, ఆడారి భాస్కర్, పాల్గొన్నారు. అనంతరం గ్రామస్తులంతా వనసమారాధనలో పాల్గొని సహపంక్తి భోజనాలు చేశారు.

వైసిపి మండల అధ్యక్షునిగా కొండబాబు

కొండబాబును అభినందిస్తున్న అమర్

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : వైసిపి మండల అధ్యక్షునిగా జోగా కొండబాబును నియమిస్తూ పార్టీ కేంద్ర కమిటీ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం. పెదమదీన గ్రామానికి చెందిన కొల్లిమల్ల అచ్చింనాయుడు మండల పార్టీ అధ్యక్షుడిగా కొనసాగు తున్నారు. ఆయన స్థానంలో అదే గ్రామం యాదవ సామాజిక వర్గానికి చెందిన యువకుడు కొండబాబుకు అవకాశం కల్పించారు. దీనిపై కొండబాబు మాట్లాడుతూ తనకిచ్చిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి, పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని, రానున్న స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేస్తానన్నారు..తనకు అవకాశం కల్పించిన పార్టీ అధినేత జగన్, జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్ జెడ్‌పిటిసి దొండా రాంబాబు, ఇతర మండల నేతలకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆటపాటలతో సందడి

స్పైస్ సందడి చేస్తున్న శ్రీప్రకాష్ విద్యార్థులు

ప్రజాశక్తి - పాయకరావుపేట : శ్రీప్రకాష్ ఇంటర్ క్రియేటివ్ ఎనర్జీస్ (స్పైస్) ప్రోగ్రాం పేరిట ప్రకాష్ జూనియర్ కళాశాల విద్యార్థులు సందడి చేశారు. విద్యార్థులంతా కలిసి శని, ఆదివారం ఆట పాటలతో రోజంతా ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. నృత్యాలతో సందడి చేశారు. విద్యార్థులకు దైనందిన కార్యక్రమాలకు భిన్నంగా పూర్తిగా ఆటపాటలతో గడపాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ వివిఎస్ఎస్. భానుమూర్తి తెలిపారు. కార్యక్రమంలో అకడమిక్ ఇన్‌చార్జి డి.శ్రీ లక్ష్మి, విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరం విజయవంతం

రోగులకు కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

ప్రజాశక్తి -కె.కోటపాడు: మండలంలోని ఆనందపురం గ్రామంలో ఆదివారం అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత మెగా కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఆనందపురం సర్పంచ్ సర్పంచ్ వంటాకు అప్పాజీ ప్రారంభించిన శిబిరంలో 44 మందికికంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, కంటిచుక్కలు అందజేశారు. 17 మందిని కంట ఆపరేషన్‌కు ఎంపిక చేసి, ప్రత్యేక బస్సులో శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించారు. అమ్మఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వైద్యశిబిరాల నిర్వహణ, ఇతర సేవా కార్యక్రమాలపై పలువురు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో చైర్మన్ గొంప వెంకటరావు, ట్రస్ట్ వైస్ చైర్మన్ సింగంపల్లిఅర్జున, టిఎన్‌టియుసి నియోజకవర్గ అధ్యక్షుడు బోజంకి సూర్యనారాయణ వర్తక సంఘం అధ్యక్షులు వి. చిట్టిబాబు, కోశాధికారి అయ్యప్ప, ప్రధాన కార్యదర్శి ఆర్.ముత్యాలనాయుడు, వంటాకు మహేష్, జిఎస్ఎస్ఎన్. మూర్తి, గురుసాగర్, కర్రి శ్రీనివాసరావు పాల్గొన్నారు. శంకర్ ఫౌండేషన్ వైద్యనిపుణులు డాక్టర్ జాక్సన్, క్యాంప్ మేనేజర్ అరుణ్ కుమార్, కర్రి కిషోర్, కర్రి గోవింద్, కర్రి శివ, వైద్య సిబ్బంది, ఆనందపురం యూత్, ట్రస్ట్ సభ్యులు సహకరించారు. ము..వారు పాల్గొన్నారు.

అన్నదాతల్లో అల్పపీడన గుబులు

కోతకు సిద్ధంగా వున్న వరి పంట

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : ఖరీఫ్ వరిపైర్లు కోతకు సిద్ధమైన తరుణంలో అల్పపీడన హెచ్చరికలతో రైతుల ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది అంతా తుపాన్లు, అల్పపీడనాలు అన్నదాతలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని వాపోయారు. ఆరుగాలం శ్రమించి, తెగుళ్ల బీడపీడలను నుంచి పంటలను రక్షించుకుని, తీరా చేతికొచ్చే దశలో వాతావరణ శాఖ అల్పపీడన హెచ్చరికలతో రైతుల్లో ఆందోళన మొదలైంది. పూర్తిగా పండి కోతకు సిద్ధంగా ఉన్న వరిపంట, ఏమాత్రం వర్షపు జల్లులు కురిసినా తీవ్రం నష్టం ఉంటుందని రైతులు గుబులు చెందుతున్నారు.

ఆలయ నిర్మాణం, అభివృద్ధికి సహకారం

పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అఖిలపక్ష నేతలు

ప్రజాశక్తి -వడ్డాది : బుచ్చయ్యపేట. మండలం వడ్డాది కొత్తూరులో పద్మనాభ సీతారామ ఆలయ నిర్మాణం, అభివృద్ధికి పూర్తి సహాయ సహకారాలు అందిస్తామని అఖిలపక్ష నేతలు తెలిపారు.ఆదివారం వడ్డాది కొత్తూరులో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వచ్చే ఏడాది ఫిబ్రవరి 26 నుంచి 28 వరకు సీతా సమేత కోదండ రామాలయం, గణపతి, మహాలక్ష్మి దేవి ఆలయాలు, ధ్వజస్తంభం, శిఖర యంత్ర ఆలయ ప్రతిష్ఠ ఉత్సవాలకు సంబంధించి వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ బోర్డు చైర్మన్ బత్తుల తాతయ్యబాబు, జెడ్‌పిటిసి దొండా రాంబాబు, నారాయణమూర్తి, దొండా సన్యాసిరావు, దొండా నరేష్, దాడి గోవింద, సయ్యపురెడ్డి సత్యనారాయణ పాల్గొన్నారు.

దోబీఘాట్ నిర్మాణానికి శంకుస్థాపన

శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ అప్పలనాయుడు

ప్రజాశక్తి - పరవాడ : పరవాడలోని రజక సామాజిక వర్గం చిరకాలంగా ఎదురుచూస్తున్న దోబీఘాట్‌ల నిర్మాణానికి ఆదివారం స్థానిక సర్పంచ్ సిరిపురపు అప్పలనాయుడు శంకుస్థాపన చేశారు. ఎన్‌టిపిసి సిఎస్ఆర్ నిధులు రూ. 8లక్షలతో వీటిని నిర్మించనున్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా సాంస్కృతిక విభాగం అధికార ప్రతినిధి పైల రామచంద్రరావు, పెద్ద చెరువు ఆయకట్టుదారుల సంఘం అధ్యక్షులు రెడ్డి శ్రీనివాసరావు, జనసేన మండల అధికార ప్రతినిధి బండారు రాజు, నాయకులు బొద్దపు అయ్యబాబు, వార్డు సభ్యుడు సిరిపురపు రాజేష్, చొప్ప సతీష్, జానీ రాంబాబు, గోపాల్‌రెడ్డి, రజక సంఘ సభ్యులు గూనూరు రవి, వాడపర్తి విశ్వేశ్వరరావు, నాని, నాగరాజు పాల్గొన్నారు.

వికలాంగ విద్యార్థులకు యూనిఫాం వితరణ

ప్రజాశక్తి అచ్యుతాపురం : సత్యసాయి సేవా బాబా శత జయంతి వేడుకల్లో భాగంగా అచ్యుతాపురం ఇంటిగ్రేటెడ్ వికలాంగుల ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు ఆదివారం స్టీల్ ప్లాంట్ పూర్వ డైరెక్టర్ కెఎస్.రావు, శారద దంపతులు రూ.లక్ష విలువచేసే స్కూల్ యూనిఫామ్‌ను అందజేశారు. ఉక్కునగరం సత్యసాయి సేవా సమితి కన్వీనర్ రామకృష్ణంరాజు, రమణ కృష్ణకుమారి, ఆశ్రమ పాఠశాల నిర్వాహకులు పిఎస్‌టి. పట్నాయక్ పాల్గొన్నారు.

ధర తగ్గినా.. దిగాలుగా అమ్మకాలు

• చికెన్ వ్యాపారానికి కార్తీకం ఎఫెక్ట్

పౌల్ట్రీలో నిల్వ ఉన్న కోళ్లు

ప్రజాశక్తి- అనకాపల్లి రూరల్ : కార్తీక మాసం ప్రభావం చికెన్ అమ్మకాలపై గణనీయమైన ప్రభావం చూపిందని అమ్మకందారులు అంటున్నారు. ధర తగ్గించినా కొనుగోలుకు పెద్దగా కానరాలేదు. కార్తీకమాసం ఆరంభం నుంచి ఉమ్మడి విశాఖ జిల్లాలో కోడి మాంసం అమ్మకాలు తగ్గిపోయాయి. సాధారణంగా ఆదివారాల్లో హాట్‌కేక్‌లా అమ్ముడయ్యే చికెన్‌వ్యాపారులు, ఇపుడు కొనుగోలుదారుల కోసం వేచి చూడాల్సిన పరిస్థితి కనిపించింది.

జిల్లాలోని విశాఖ, అనకాపల్లి, భీమిలి, చోడవరం, నర్సీపట్నం, అరకు ప్రాంతాలలో చికెన్ షాపుల వద్ద గతంలో కనిపించిన రద్దీ ఈ వారం కనిపించలేదు. ధర పడిపోయినా కొనుగోలు మాత్రం అంతంతే. సాధారణ రోజుల్లో చికెన్ కిలో అటుఇటుగా రూ.250 పలుకుతుంది. ప్రస్తుతం కార్తీకం నెల మొదలైనప్పటి నుండి ధరను బాగా తగ్గించినప్పటికీ అమ్మకాలు పెరగలేదు. అయితే కార్తీకమాసం మరో నాలుగైదు రోజుల్లో ముగియనుండడంతో చికెన్ అమ్మకాలు మళ్లీ పుంజుకుంటాయని, అదే సమయంలో ధర కూడా మళ్లీ రూ.240 నుంచి రూ.260 అంతకుమించి పెరిగే అవకాశం ఉందనే వ్యాపారులు, పెంపకందారులు ఆశాభావం వ్యక్తపరుస్తున్నారు.

మత్స్యకార యువతలో మార్పు రావాలి

• ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్

ఎమ్మెల్యే విజయకుమార్‌ను సత్కరిస్తున్న మత్స్యకారులు

ప్రజాశక్తి -అచ్యుతాపురం: ఎస్ఇజెడ్ పరిశ్రమలలో స్థానిక మత్స్యకారులకు ఉద్యోగ, ఉపాధి కల్పనకు శాయశక్తులా కృషి చేస్తానని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ భరోసానిచ్చారు. అయితే మత్స్యకార యువత ఆవేశాన్ని తగ్గించుకుని, తరచూ ఘర్షణలకు పాల్పడుతున్నారన్న వైఖరిలో మార్పు రావాలని పిలుపునిచ్చారు. ఆదివారం 'నేను నా యువత' కార్యక్రమంలో భాగంగా పూడిమడకను సందర్శించారు. కూటమి ప్రతినిధుల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సమావేశంలో ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సుందరపు మాట్లాడుతూ, పరిశ్రమల కాలుష్యంతో సముద్రం, ఉప్పుటేరులో చేపలు చనిపోవడంతో కాలుష్య నియంత్రణ మండలి అధికారుల దృష్టికి అనేకమార్లు తీసుకెళ్లినావారి పనితీరులో మార్పు లేదన్నారు. కాలుష్య సమస్యపై ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. అనంతరం తీవ్రంగా స్పందించారన్నారు. గ్రామ అభివృద్ధికి దశలవారీగా నిధులు మంజూరు చేస్తానని, ప్రజలు ముందుకొచ్చి సహకరిస్తే అభివృద్ధి సాధ్యపడుతుందన్నారు. టిడిపి మండల నాయకులు మెరుగు బాపు నాయుడు, ఎరిపల్లి కిరణ్, పొన్నమల్ల కొండబాబు పాల్గొన్నారు.

మత్స్యకార సమస్యలపై పోరాటం : వైసిపి

మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధికార ప్రతినిధి జగన్

ప్రజాశక్తి -అచ్యుతాపురం: పూడిమడక మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటం చేస్తామని వైసిపి జిల్లా అధికార ప్రతినిధి ఉమ్మడి జగన్ అన్నారు ఆదివారం. పూడిమడక గ్రామంలో నేటి యువత కార్యక్రమంలో భాగంగా గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే విజయ్‌కుమార్ దృష్టికి సమస్యలు తీసుకువెళ్లడానికి ప్రయత్నించగా పట్టించుకోలేదన్నారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ పూడిమడకలో ఫిషింగ్ హార్బర్ పనులు వెంటనే ప్రారంభించాలన్నారు. మత్స్యకారులకు ప్రభుత్వం చెల్లించాల్సిన పెండింగ్ ప్యాకేజీలు వెంటనే చెల్లించాలని, పూడి దగ్గర ఉన్న ట్రీట్‌మెంట్ ప్లాంట్ నుండి విషవాయువులను అరికట్టాలని కోరారు.కార్యక్రమంలో ఉమ్మడి అప్పారావు, పైడియ్య, అప్పారావు , శ్రీను అప్పలరాజు పోలయ్య మల్లికార్జున జగదీష్ ఎర్రయ్య రాజు తాతారావు నూకరాజు పాల్గొన్నారు .

కేన్సర్ నివారణోపాయాలపై అవగాహన

ప్రజాశక్తి-అనకాపల్లి : పొగాకు ఉత్పత్తుల వినియోగం, మద్యం అలవాటు, రసాయనాలతో పండించే ఆహారోత్పత్తులను తీసుకోవడం, వాతావరణ కాలుష్యం ఇలా పలుకారణాలత కేన్సర్ వచ్చే అవకాశం ఉందనివిశ్రాంత రసాయన శాస్త్ర ప్రొఫెసర్ కొయిలాడ రామ మోహనరావు అన్నారు. ఆదివారం స్థానిక వాకర్స్ క్లబ్‌లో కేన్సర్ నివారణోపాయాలపై అవగాహన కల్పించారు. కేన్సర్ వ్యాధి పట్ల అవగాహన లేకపోవడం, ఉన్నా నిర్లక్ష్యం, మితంగా ఆహారం తీసుకోవడం, శీతల పానీయాలు, పిజ్జాలు, బర్గర్లు తినడం, పేపర్ ప్లేట్స్, ప్లాస్టిక్ గ్లాసెస్, నూడిల్స్, చిరు తిండ్లు, అలాగే పదేపదే వాడే నూనెలతో తయారుచేసే హోటళ్లలోని ఆహారపదార్థాలను తినడం, మితిమీరిన మొబైళ్ల వాడకం వల్ల కేన్సర్ వచ్చే ప్రమాదం ఉందన్నారు. తినే ఆహారపదార్థాల్లో పసుపు విరివిగా వాడాలని, కాయగూరలను బాగా నీళ్లలో కడిగి వండాలని సూచించారు. మహిళలు గర్భాశయ, రొమ్ము కేన్సర్లపై కూడా అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం డాక్టర్ రామ్మోహనరావును సీనియర్ వాకర్ డాక్టర్ కె.విష్ణుమూర్తి, అధ్యక్షులు రాపేటి నారాయణ రావు, కార్యదర్శి వై. శివ, కోశాధికారి కెవివి సత్యనారాయణ, వంకాయల ఈశ్వరరావు, కాండ్రేగుల జగదీష్, ఆడారి మల్లికార్జునరావు, నల్లల దేవుళ్లు, డాక్టర్ కె వీరభద్రరావు తదితరులు దుశ్శాలువాతో సత్కరించారు.

ముగిసిన నరెడ్కో ప్రాపర్టీ షో

ముగింపు వేడుకలో ఎమ్మెల్యే సుందరపు, మేయర్ పీలా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం బీచ్ రోడ్డులోని గాదిరాజు ప్యాలెస్ వేదికగా నిర్వహించిన నరెడ్కో ప్రాపర్టీ షో ఆదివారం సాయంత్రంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో ప్రారంభోపన్యాసం చేసిన నరెడ్కో రాష్ట్ర అధ్యక్షులు చక్రధర్ మాట్లాడుతూ ప్రాపర్టీ షోకు మంచి ఆదరణ దక్కిందన్నారు. సిఐఐ సదస్సులో 13 లక్షల కోట్ల ఒప్పందాలు జరిగాయని, వీటితో విశాఖ రూపురేఖలు పూర్తిగా మారిపోతాయని, అంతర్జాతీయ నగరంగా మారడం ఖాయమని తెలిపారు. అనంతరం ముఖ్య అతిథిగా హాజరైన యలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి దూరదృష్టి. విజన్ రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి దోహదపడతా యన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ రాష్ట్రంలో జల్ జీవన్ మిషన్ ద్వారా లక్ష కోట్లతో గోదావరి వాటర్ ఇచ్చే కార్యక్రమం రూపుదాల్చబోతుందని తెలిపారు. పారిశ్రామికంగా అచ్యుతాపురంలో అనేక పరిశ్రమలతో పాటు ఉమ్మడి విశాఖలో గూగుల్ డేటా సెంటర్, మిట్టల్ స్టీల్‌ప్లాంట్ వంటివి వస్తున్నాయన్నారు. ప్రముఖ కంపెనీల రాక నేపథ్యంలో రోడ్ల అభివృద్ధి, అనుసంధానం పెరగనున్నాయన్నారు. దీని ద్వారా అనకాపల్లి శివారు ప్రాంతాలు అభివృద్ధిలో దూసుకుపోతున్నాయని తెలిపారు. నగర మేయర్ పీలా శ్రీనివాసరావు మాట్లాడుతూ విశాఖ ప్రశాంత నగరమని, దేశవిదేశాల్లో ఉండి స్థిరాస్తులు కొనుగోలు చేసినా ప్రశాంతంగా ఉండొచ్చని అన్నారు. అన్ని అనుమతులతో నిర్మాణాలు చేపట్టాలని బిల్డర్లను కోరారు. మున్సిపల్ వాటర్ కూడా ప్రతి అపార్టుమెంట్‌కు వచ్చిన తర్వాతే ఇవ్వాలని, ఆ విధంగా నరెడ్కోవారు కృషి చేయాలని కోరారు. నరెడ్కో నమ్మకమైన సంస్థ అని పేర్కొన్నారు. ముగింపు కార్యక్రమంలో బంపర్ డ్రాలో విజేతలకు బహుమతులు అందజేశారు. నరెడ్కో ఉత్తరాంధ్ర సలహా కమిటీ ఛైర్మన్ ఛోడే పట్టాభిరామ్, రాష్ట్ర అధ్యక్షులు గద్దె చక్రధర్, ఉత్తరాంధ్ర అధ్యక్షులు రమేష్ బాబు, విశాఖ నగర అధ్యక్షులు రాజశేఖర్, కార్యవర్గ సభ్యులు వెంకన్న చౌదరి, పాపారావు, సుబ్బారావు, మిధున్, ధర్మా పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవార్ల పండగలు

ప్రజాశక్తి -సబ్బవరం.: మండలంలోని అంతకాపల్లి, మల్లునాయుడుపాలెం పంచాయతీలలో భూలోకమ్మ పండగ, అలాగే ఆదిరెడ్డిపాలెం, పెదనాయుడుపాలెం గ్రామాలలో పెసలమ్మ పండగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. అంతకాపల్లి గ్రామదేవత భూలోకమ్మ పండగ సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. శతకంపట్టు నుంచి గ్రామశివారున ఉన్న గుడి వరకు ఊరేగింపుగా వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. మాజీ ఎంపిపి సబ్బవరం ముత్యాల నాయుడు, ఎంపిటిసి చొక్కాకుల గోవింద్, ఉప సర్పంచ్ గొర్లి అప్పారావు, మాజీ సర్పంచ్ సబ్బవరపు దేవుడు బాబు, వైసిపి మండల జనరల్ సెక్రెటరీ గొర్లి ఎర్రినాయుడు, గొంప అప్పలనాయుడు, బోకం కేసరి పాల్గొన్నారు.

హాకీ క్రీడాకారులకు టీ షర్ట్స్

టీషర్ట్స్ అందుకున్న క్రీడాకారులతో జివి.రెడ్డి

ప్రజాశక్తి-యలమంచిలి టౌన్: యలమంచిలి పట్టణంలోని డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో జరిగిన హాకీ పోటీల్లో జిల్లా అసోసియేషన్ వైస్ చైర్మన్ జివి రెడ్డి స్థానిక హాకీ క్రీడాకారులకు టీ షర్ట్ స్పాన్సర్ చేసి అందజేశారు. ఈ సందర్భంగా జివి రెడ్డి మాట్లాడుతూ హాకీ మీద ఉన్న అభిమానంతో తాను క్రీడాకారులకు టీ షర్ట్‌లను అందజేశానన్నారు. భవిష్యత్‌లోనూ తన సహకారం కొనసాగుతుందని స్పష్టం చేశారు.కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ కె నరేష్, డి మహేష్, జి రాంబాబు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ఆదివాసీ మహిళల నిరసన

ప్రజాశక్తి -మాడుగుల:తాగునీటి సమస్యను పరిష్కరించాలని మాడుగుల మండలం ఆవురువాడ పంచాయతీ చినగోర్రిగెడ్డ గ్రామంలో మోకాళ్లపై ఆదివాసి మహిళలు ఆదివారం నిరసన .చేపట్టారు. ఈ సందర్భంగా వారు విలేకర్లకు తమ ఆవేదనను వెలిబుచ్చారు. గ్రామంలో సుమారు 30 గిరిజన కుటుంబాలు నివసిస్తున్నాయి. గ్రామంలో రెండు బోర్లు ఉన్నప్పటికీ చుట్టుప్రక్కల ఉండే క్వారీలు ప్రభావితంతో బోర్లు నుండి వస్తున్నా నీరు బురదగా వచ్చి కలుషితం అవుతుందని తెలిపారు. ఇటీవల అధికారులకు ఫిర్యాదు చేయగా పంచాయితీ సెక్రెటరీ పరిశీలన చేశారన్నారు. అయినప్పటికీ నేటికి సమస్య పరిష్కారం కాలేదు కదా నీరు బాగుందని చెప్పడం ఎంతవరకు సమంజసమని మహిళలు ప్రశ్నించారు.గ్రామంలో జల జీవన్ మిషన్ ద్వారా వాటర్ ట్యాంక్ నిర్మాణం చేస్తామని చెప్పి పునాదుల్లోనే ఆపివేశారన్నారు. క్వారీలతో భూగర్భ జలాలు ఎండిపోయి నీరు కలుషితం గా మారుతుందన్నారు. ఇప్పటికే బురద వాటర్ బాటిల్స్ తో నిరసన తెలియజేసి నర్సీపట్నం ఆర్డిఓకి వినతి పత్రం ఇచ్చామన్నారు. బోరు నుంచి నీరు 5 నుంచి 6 బిందెలు తోడేసరికి బురదగా వస్తుందని, కిలుం వాసన వేస్తుందని తెలిపారు. బిందులోకి ఈ వ్యర్థ పదార్థాలు ఏవి పడకుండా బోరు గొట్టానికి తెల్లటి వస్త్రాన్ని కట్టి వడకట్టుకొని నీరు తాగడానికి, వంట చేసుకోవటానికి వినియోగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేవారు. గ్రామంలో మినరల్ వాటర్ ప్లాంట్, జల జీవన్ మిషన్ ద్వారా పైపులైన్ ఏర్పాటు చేసి తక్షణమే నీరు ఇవ్వాలని ఆదివాసి గిరిజన మహిళలు జిల్లా కలెక్టర్‌ను వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో కింజాడ దేవి, కింజాడ వరలక్ష్మి, సోలం లక్ష్మి, సోలం.సన్యాసమ్మ, గిరిజన మహిళలు పాల్గొన్నారు.

ఆందోళన చేపడుతున్న ఆదివాసీ మహిళలు

బియ్యం అందిస్తున్న దీక్షాపరులు

2 టన్నుల బియ్యం వితరణ

ప్రజాశక్తి -నక్కపల్లి:అఖిల భారత అయ్యప్ప చిన్ముద్ర సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో పంబ వద్ద చేయనున్న అన్న సమారాధన కార్యక్రమానికి 2 టన్నుల బియ్యం పంపిస్తున్నట్లు అయ్యప్ప దీక్షాపరులు వీసం రామకృష్ణ తెలిపారు. నక్కపల్లి లో వీసం నానాజీ పీఠం తరపు నుండి దీక్షాపరులు 2 టన్నుల బియ్యం ను గురుస్వామి చంటికి అందజేశారు. పంబ వద్ద అన్న సమారాధన చేయనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ వీసం నానాజీ, దీక్షాపరులు వీసం శ్రీను, బంగార్రాజు, నున్న గణేష్, సకురు రమణ, వీరబాబు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బల్క్ డ్రగ్ పార్క్‌ను నిలుపుదల చేయాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటు చేస్తే తమ జీవనోపాధి పూర్తిగా దెబ్బతింటుందని మత్స్యకారులు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మత్స్యకారులు తలపెట్టిన శాంతియుత రిలే దీక్షలు ఆదివారం నాటికి 64వ రోజుకు చేరింది. బల్క్ డ్రగ్‌ను వ్యతిరేకిస్తూ మత్స్యకారులు పెద్దపెట్టున నినాదాలు చేశారు. బల్క్ డ్రగ్ ఏర్పాటు చేయడంతో తమ జీవితాలు సర్వనాశనం అవుతాయని, తమ ఉనికికే ప్రమాదం వాటిల్లుతుందని మత్స్యకారులు ఆవేదన వెలబుచ్చారు. హెటిరో కంపెనీ ఏర్పాటు చేయకముందు సముద్ర తీరంలో మత్స్య సంపద పుష్కలంగా లభించేదని, ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. కంపెనీ వ్యర్థ రసాయన జలాలు సముద్రంలోకి వదలడంతో మత్స్య సంపద నశించి పోయిందన్నారు. ఇప్పుడు ఎంత దూరం వెళ్లినా చేపలు పడటం లేదన్నారు. కంపెనీ కాలుష్యం కారణంగా అనేక రకాల ప్రాణాంతకమైన వ్యాధులు బారిన పడుతున్నామని, కొంతమంది వైద్యం చేయించుకోలేక మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ జీవితాలు అగమ్యగోచరం గా మారాయని ఆవేదన వెలిబుచ్చారు. వేట సాగితే గాని పూటగడవని పరిస్థితుల్లో కొట్టిమిట్టాడుతున్నామన్నారు. ఇటు వంటి పరిస్థితుల్లో బల్క్ డ్రగ్ ఏర్పాటు చేస్తే తమ బతుకులు బుగ్గిపాలు అవుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పి పైడితల్లి, జి మేనికొండా, పి సత్యం, ఎం మహేష్ బాబు, పిక్కి తాతీలు, వై.నాగేష్, చొక్కా కాశీ, కారే వెంకటేష్, పి నల్ల, సోమేశ్వరరావు, రామ్‌చరణ్, పి కోదండరావు, కాశీ పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న మత్స్యకారులు

విజ్ఞానదాయకంగా గ్రంథాలయ వారోత్సవాలు

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలో చినదొడ్డిగల్లు శాఖ గ్రంథాలయంలో గ్రంథాల అధికారి జనార్దన్ ఆధ్వర్యంలో ఆదివారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు పద్య పఠన పోటీలు నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.బాలాజీ ముఖ్య అతిథిగా హాజరై, గ్రంథాలయ ఉద్యమ నాయకులు చిత్రపటాలకు పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం చేసే అలవాటును అలవర్చుకోవాలన్నారు. పద్య పఠన పోటీల్లో పలువురు విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. విజేతలకు ముగింపు రోజున బహుమతులు అందజేయనున్నట్లు గ్రంథాలయ అధికారి జనార్ధన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సామాజిక సేవ కార్యకర్త జి నానాజీ పాల్గొన్నారు.

నక్కపల్లిలో పోటీలు నిర్వహిస్తున్న లైబ్రేరియన్

నర్సీపట్నం: గ్రంథాలయాలు విద్యాబాండాగారాలు అని పిఆర్‌టియు జిల్లా నాయకులు గోపీనాథ్ తెలిపారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం ఆయన శాఖా గ్రంథాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రంథాలయాలను విద్యార్థులు వినియోగించుకోవాలని కోరారు.గ్రంథాలయ అధికారి దమయంతి విద్యార్థులతో నిర్వహించిన స్టోరీ టెల్లింగ్, క్విజ్ పోటీలు పరిశీలించారు, ఈ కార్యక్రమంలో ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత ప్రభాకర్ పాల్గొన్నారు.

గొలుగొండ:గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా గొలుగొండ శాఖా గ్రంథాలయంలో ఆదివారం పితామహులకు గ్రంథాలయాధికారి ఎస్.వరలక్ష్మీ ఆధ్వర్యంలో ఘన నివాళి అర్పించారు. అనంతరం విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సోషల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాడుగుల: మాడుగుల, కెజె పురం గ్రామాలలో గ్రంథాలయ పితామహులు అయ్యంకి వెంకట రమణయ్య, రంగనాథన్, నాగభూషణంల చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సాయంత్రం వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాడుగుల గ్రంథాలయ అధికారి ఎడ్ల వెంకటేశ్వరరావు, కేజే పురం గ్రంథాలయ అటెండర్ వి.శృతి పాల్గొన్నారు.

కశింకోట: తాళ్ళపాలెం శాఖా గ్రంథాలయంలో ఆదివారం జూనియర్స్, సీనియర్స్ విభాగాలుగా విద్యార్థులకు విశ్రాంత లైబ్రేరియన్ జి.మురళీకృష్ణ ఆధ్వర్యంలో క్విజ్, చదరంగం పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్ కె.జగన్నాథం,ఉపాధ్యాయురాలు కె.వి.నూకరత్నం, పిడి సుకురమ్మ, ఎస్. భానుప్రసాద్ పాల్గొన్నారు.

యలమంచిలి :గ్రంథాలయ ఉద్యమ పితామహులకు నివాళులర్పించారు. గ్రంథాయాధికారి వి.ఆనంద్ ఆధ్వర్యంలో రామునాయుడు, అబ్బులా, శేఖరమంత్రి నరసింగరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

పాయకరావుపేట : స్థానిక శాఖాగ్రంథాలయంలో లైబ్రేరియన్ వామాల లక్ష్మణరావు ఆధ్వర్యంలో గ్రంథాలయోద్యమకారులకు నివాళులర్పించారు. . రాష్ట్రకాపు కార్పోరేషన్ డైరెక్టర్ పెద్దిరెడ్డి చిట్టిబాబు, తెలుగు ఉపాధ్యాయుడు ఎన్‌విఎస్.ఆచార్యులు రాష్ట్ర సాంస్కృతిక శాఖ డైరక్టర్ విలియం కేరీ, వైస్ సర్పంచ్ భవానీ శ్రీనివాస్, గూటూరు శ్రీనివాస్ పాల్గొన్నారు.

కె.కోటపాడు: చౌడువాడ శ్రాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఎం.పద్మావతి ఆధ్వర్యంలో విద్యార్థులకు కుర్చీలాట, నీతికథల బోధన చేపట్టారు.

కోటవురట్ల: స్థానిక గ్రంథాలయంలో లైబ్రేరియన్ అప్పలనాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణపై డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు.

భీమునిపట్నం : స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు మ్యూజికల్ చైర్ తదితర ఆటల పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ మహేష్, ప్రసాదరావు, వర్మ తదితరులు పాల్గొన్నారు.

సీతమ్మధార : పౌర గ్రంథాలయంలో కథారచనా, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ప్రసిద్ధ కథాకారిణి సీతా శ్రీనివాస్ ఆసక్తికరమైన కథా విన్యాసం స్టోరీ అండ్ ఆర్ట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో కెఎ.చౌదరి, డిఎస్.వర్మ, ప్రసాద్ పాల్గొన్నారు.

మాధవధార : ఎమ్మెన్నార్ గ్రంథాలయంలో వ్యక్తిత్వ వికాసం, డ్రాయింగ్, వ్యాసరచన, చదరంగం పోటీలు నిర్వహించారు. జివిఎంసి, గాయత్రి విద్యా మందిర్, మాధవ మురళి, మినర్వా, అపూర్వ స్కూల్ విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వావిలాపల్లి ప్రసాద్, అన్నెపు నారాయణరావు, సుదర్శనరావు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : అల్లిపురం శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన కార్యక్రమానికి గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బుర్రి కుమార్ రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. స్వాతంత్ర్య ఉద్యమానికి గ్రంథాలయ ఉద్యమం స్ఫూర్తినిచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. గ్రంథాలయాలను ప్రజలకు మరింత చేరువ చేయడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో విశాఖపట్నం ఐఐఎంవి సీనియర్ లైబ్రరీ మేనేజర్ డాక్టర్ విగ్నేష్, గ్రంథాలయాధికారి పివిఎస్.రాజు పాల్గొన్నారు.

ఎంవిపి.కాలనీ : ఎంవిపి.కాలనీలోని నగర శాఖ గ్రంథాలయం ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. గ్రంథాలయాధికారి కెవిఎ.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

బెడ్స్ అందజేస్తున్న సంఘాల సభ్యులు, గ్రామపెద్దలు

హాస్టల్‌కు బెడ్స్ పంపిణీ

ప్రజాశక్తి -మాడుగుల:మాడుగుల బీసీ హాస్టల్‌లో విద్యార్థులకు శనివారం సేవా భారతి, ఆరోహన్ ట్రైబల్ సోసైటి, రోటరీ క్లబ్ ఆద్వర్యంలో బెడ్స్ పంపిణీ చేశారు. సేవాభారతి, రోటరీ క్లబ్ నుంచి మండలంలోని 20 గిరిజన గ్రామాల్లో పాఠశాలల విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘాల ప్రతినిధులు, గ్రామపెద్దలు సర్పంచి ఎడ్ల కళావతి, శ్రీనాదు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మొక్కను నాటుతున్న సోమసుందర్

అల్లూరి పార్కును సందర్శించిన సోమసుందర్

ప్రజాశక్తి-గొలుగొండ: గొలుగొండ మండలం కృష్ణదేవిపేటలో గల అల్లూరి పార్కును ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ సెక్రటరీ జనరల్ సోమసుందర్ ఆదివారం సందర్శించారు. చింతపల్లిలో నిర్వహించిన పాత్రికేయుల శిక్షణ తరగతులకు ఆయన హాజరయ్యారు. అనంతరం అల్లూరి పార్కును సందర్శించి అల్లూరి, గంటన్న దొర సమాధులకు నివాళులర్పించారు. అలాగే కృష్ణదేవిపేటలో పాత్రికేయులు ఏర్పాటు చేసిన జాతీయ పత్రిక దినోత్సవం కార్యక్రమంలో పాల్గొని మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో గొలుగొండ, కృష్ణదేవిపేట పాత్రికేయులు పాల్గొన్నారు.

శంకుస్థాపన చేస్తున్న నాయకులు

శ్మశానవాటిక నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని ఏటిగైరంపేట గ్రామంలో శ్మశాన వాటిక నిర్మాణానికి ఆదివారం కూటమి నాయకులు శంకుస్థాపన చేశారు. స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు శ్మశానవాటికకు నిధులు మంజూరు చేయడం జరిగిందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ రామకృష్ణ, మాజీ ఎంపిటిసి నల్లబెల్లి రాజబాబు, గ్రామ పార్టీ అధ్యక్షులు అల్లు స్వామి, చీడిగుమ్మల పిఎసిఎస్ డైరెక్టర్ నందిపల్లి రమణ, నల్లబెల్లి స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఐద్వా నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండలో ఆదివారం అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా) సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల ఐద్వా అధ్యక్షులుగా చిన్నిమంగ, కార్యదర్శిగా ఉల్లి రమణమ్మ, కార్యదర్శివర్గంలో లోవరాణి, మణికుమారి, బి.లక్ష్మి, మరో ఐదుగురు సభ్యులను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి డి.వరలక్ష్మి మాట్లాడుతూ, మహిళలు ఎదుర్కొనే సమస్యలపై ఐద్వా పని చేస్తుందన్నారు. మహిళల హక్కుల కోసం నిరంతరం పోరాడు తుందని చెప్పారు. ఈ సమావేశంలో ఐద్వా జిల్లా ట్రెజరర్ కేవి.సూర్యప్రభ తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో కాంప్లెక్స్ ఉన్నా.. లేనట్టే..!

ఆవరణలోకి రాని బస్సులు ▸ రోడ్డుపై ప్రయాణికుల పడిగాపులు

ప్రజాశక్తి -నక్కపల్లి: నక్కపల్లి ఆర్‌టిసి కాంప్లెక్స్ ఉన్నా.. లేనట్లుగానే ఉంది. కాంప్లెక్స్‌లోకి బస్సులు రానందున నిరుపయోగంగా దర్శనమిస్తుంది. కాంప్లెక్స్ ఆవరణలోకి బస్సులు రానందున ప్రైవేట్ వాహనాలకు నిలయంగా మారింది.

సుమారుగా 16 ఏళ్ల క్రిందట నక్కపల్లిలో ఆర్‌టిసి కాంప్లెక్స్ నిర్మించారు. మొదటి బస్సులు కాంప్లెక్స్ లోనికి వచ్చేవి. రాను రాను బస్సులు కాంప్లెక్స్ లోకి రాకుండానే హైవే నుంచే వెళ్లిపోవడం ప్రారంభించాయి. గత కొన్ని సంవత్సరాల నుండి ఇదే పరిస్థితి కొనసాగుతుంది. విశాఖ వైపు నుంచి వచ్చే ఎక్స్ ప్రెస్‌లు, పాసింజర్ బస్సులు కాంప్లెక్స్ లోకి రాకపోకలు సాగించేందుకు అనుకూలంగానే ఉంది. తుని వైపు నుంచి విశాఖ వైపు వెళ్లే బస్సులు నక్కపల్లి హైవే కాంప్లెక్స్ జంక్షన్ వద్ద టర్నింగ్ పాయింట్ లేక పోవడంతో కాంప్లెక్స్ లోకి

నిరుపయోగంగా దర్శనమిస్తున్న కాంప్లెక్స్

బస్సులు వచ్చేందుకు అంత అనుకూలంగా లేదు. దీంతో, ఇటు విశాఖ వైపు నుంచి వచ్చే బస్సులు గాని ,తుని వైపు నుంచి వచ్చే బస్సులు గాని కాంప్లెక్స్ లోకి రాలేదు. కనీసం అనకాపల్లి నుంచి పాయకరావుపేట వెళ్లే పాసింజర్ బస్సులు కూడా కాంప్లెక్స్‌లోకి రాకపోవడంతో ప్రయాణికులు రోడ్లపైనే బస్సుల కోసం పడిగాపులు కాయలసిన పరిస్థితి నెలకొంది. చుట్టుపక్కల గ్రామాలకు నక్కపల్లి ప్రధాన కేంద్రం. ఆయా గ్రామాల ప్రజలు ఊర్లు వెళ్లాలంటే నక్కపల్లి రావలసిందే. కాంప్లెక్స్ లోనికి బస్సులు రానందున రోడ్డుకు ఇరువైపులా ఉన్న దుకాణాల వద్ద, రోడ్ల పైన ప్రయాణికులు బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. ఎండకు, వానకు ప్రయాణికులు ఇబ్బందులు వర్ణణాతీతం. విద్యార్థులు సైతం బస్సుల కోసం రోడ్లపై నిరీక్షించాల్సిందే. స్త్రీ శక్తి పథకం లో భాగంగా ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించడంతో పెద్ద సంఖ్యలో మహిళలు ప్రయాణాలు సాగిస్తున్నారు. కాంప్లెక్స్ లోనికి బస్సులు రానందున, రోడ్డుపై నిలబడి బస్సుల కోసం ఎదురుచూస్తూ ఇబ్బందులు పడుతున్నారు.కాంప్లెక్స్ లోకి బస్సులు రానందున రోడ్డు దాటే సమయంలో ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. లక్షలాది రూపాయలు వెచ్చించి కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టి, బస్సులు రాకుండా నిరుపయోగంగా వదిలేయడం పట్ల ప్రయాణికులు అధికారుల తీరుపై మండిపడుతున్నారు. కోట్లాది రూపాయల విలువైన స్థలంలో కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టినప్పటికీ, వినియోగించకపోవడంతో చెత్తా చెదారంతో దర్శనమిస్తుంది. అధికారులు స్పందించి కాంప్లెక్స్‌లోనికి బస్సులు వచ్చే విధంగా చర్యలు చేపట్టాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.

ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు

కాంప్లెక్స్ లోనికి బస్సులు వచ్చే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలి. గత కొన్నేళ్ల నుండి కాంప్లెక్స్ లోనికి బస్సులు రాకపోవడం వల్ల ప్రయాణికులు బస్సుల కోసం రోడ్డుపై నిలబడి అవస్థలు పడుతున్నారు. విద్యార్థులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. కాంప్లెక్స్ లోనికి బస్సులు రానందున నిరుపయోగంగా దర్శనమిస్తుంది. కాంప్లెక్స్ ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసి, బస్సులు వచ్చే విధంగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలి.

మేడేటి శంకర్,
నక్కపల్లి

నిరసన చేపడుతున్న గిరిజనులు

రోడ్డు పనులు ప్రారంభించాలి

-గిరిజనుల వినూత్న నిరసన

ప్రజాశక్తి-రోలుగుంట: ముంథా తుపాన్‌కు రోడ్డు కొట్టుకు పోయిందని, తక్షణమే పనులు ప్రారంభించాలని రోలుగుంట మండలం పిత్రిగెడ్డ, నీలిబంద, జాజులబంద, పెదగరువు ఆదివాసీ గిరిజనులు ఆదివారం అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కే.గోవిందరావు మాట్లాడుతూ, అర్ల పంచాయతీ అర్ల నుండి పిత్రిగెడ్డ వరకు ఉపాధి హామీ పథకం నుండి 4కోట్ల 10లక్షల రూపాయలతో బిటి రోడ్డు నిర్మాణం కోసం నిధులు మంజూరు చేశారని తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే పల్లె పండుగ సందర్భంగా రోడ్డు పనులు ప్రారంభించారన్నారు. 2024 సంవత్సరంలో రోడ్డు పనులు మొదలుపెట్టారని, రోడ్డు ఫార్మేషన్ వేశారని, పిక్కరాయి రోలింగ్ చేసి వేశారన్నారు. కానీ కల్వర్టు కట్టలేదన్నారు. దీంతో, ముంథా తుపాన్ కారణంగా మొత్తం రోడ్డు కొట్టుకుపోయిందని చెప్పారు. దీంతో 108 వాహనం వచ్చే అవకాశం లేకుండా పోయిందన్నారు. తక్షణమే ఈ రోడ్డు నిర్మాణాన్ని ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొర్రా బాబురావు, కొర్ర కొండబాబు, గెమ్మెలి చిన్న, గెమ్మిలి అప్పారావు, జాజులబంద స్కూల్ విద్యా కమిటీ ఛైర్మన్ కిల్లో కామేష్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజు

డ్రగ్స్‌తో కుటుంబాలు నాశనం

-ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు

ప్రజాశక్తి- రావికమతం:

డ్రగ్స్‌తో కుటుంబాలు నాశనం అవుతాయని చోడవరం శాసన సభ్యులు కేఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. మండలంలో కొత్తకోట సిఐ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల ప్రభావం పై అవగాహన సదస్సును ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మాదకద్రవ్యాల నిర్మూలనకు, యువతలో అవగాహన పెంపొందించేందుకు చేపట్టిన అభ్యుదయ సైకిల్ యాత్ర ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. మాదకద్రవ్యాల వినియోగం ఒక నేరం మాత్రమే కాదు. కుటుంబాలను నాశనం చేస్తుందన్నారు. కుటుంబంలో ఆర్థిక సమస్యలు పెరుగుతాయన్నారు. కుటుంబాలు, విద్యాసంస్థలు, సమాజం కలిసి పనిచేసినప్పుడే నిర్మూలన సాధ్యం అన్నారు. సైకిల్ యాత్ర"ను చోడవరం శాసనసభ్యులు జెండా ప్రారంభించారు. సిఐ కోటేశ్వరరావు యాంటీ-డ్రగ్ ప్రతిజ్ఞ చేయించారు. డ్రగ్ వాడటంతో జరిగే ప్రమాదాలపై కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ కొండ నాయుడు, కోట గోవిందు, నీలవేణి, తహసిల్దార్ అంబేద్కర్, ఎస్ఐ రఘువర్మ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పర్యాటక ప్రాంతాలు కిటకిట

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: మండలంలో పర్యాటక కేంద్రమైన చాపరాయి జలపాతంలో ఆదివారం అధిక సంఖ్యలో పర్యాటకులు పోటెత్తారు. దీంతో పర్యాటక ప్రాంతం పర్యాటకుల సందర్శనతో కిటకిటలాడింది. పర్యాటకులు జలపాతంలో స్నానాలు ఆచరిస్తూ ఆనందంగా గడిపారు. **అనంతగిరి:** మండలంలో ప్రముఖ పర్యాటక ప్రాంతాలు కిటకిటలాడాయి. బొర్రా గుహలతో పాటు ఘాట్ రోడ్డు, డముకు యు పాయింట్, కటికి, తాడిగుడ, చిట్టంపాడు వంటి పర్యాటక ప్రాంతాలు జనాలతో కిటకిటలాడాయి.

పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి చర్యలు

● విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్ జట్టి

సిబ్బందికి సూచనలు చేస్తున్న డిఐజి గోపీనాథ్

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : పెండింగ్ కేసుల సత్వర పరిష్కారానికి చర్యలు చేపట్టాలని విశాఖ రేంజ్ డిఐజి గోపీనాథ్‌జట్టి ఆదేశించారు. ఆదివారం బుచ్చయ్యపేట పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఆయనకు స్థానిక ఎస్ఐ ఎ..శ్రీనివాసరావు స్వాగతం పలికారు. స్టేషన్ పరిసరాలు, రికార్డులు, దర్యాప్తు విధానాలు, పెండింగ్ కేసుల ప్రగతిని పరిశీలించి, తగు సూచనలు చేశారు. గంజాయి అక్రమ రవాణాపై ఆకస్మిక తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. మత్తుకు బానిసైన వాళ్లను గుర్తించి కౌన్సిలింగ్, రెహాబిలిటేషన్, అవగాహన చేపట్టాలన్నారు. బ్యాంకు ఖాతాలు, ఒటిపి, వ్యక్తిగత వివరాల గోప్యత వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించి సైబర్ నేరాల నివారణకు చర్యలు చేపట్టాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధన అమలుకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను డిస్పోజ్ చేయాలన్నారు. మహిళా చట్టాలపై అవగాహన, హెల్ప్‌లైన్ల వినియోగంపై విస్తృత ప్రచారం చేయాలని సూచించారు. నేరాల నియంత్రణకు సిసి టివి కెమెరాల ఆవశ్యకతను వివరించి, ప్రజల భాగస్వామ్యంతో విరివిగా ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఆరోపణలు తావు లేకుండా క్రమశిక్షణతో విధులను నిర్వర్తించి సేవలు అందించాలని సూచించారు. ఎస్ఐలు.శ్రీనివాసరావు, రఘువర్మ, నారాయణరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పిఎసిఎస్‌ల సేవలను మరింత చేరువ చేస్తాం

ప్రజాశక్తి- దేవరాపల్లి : ..రైతుల ఆర్థికాభివృద్ధికి, గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకలాంటి పిఎసిఎస్‌ల అభివృద్ధికి కృషి చేసి, వాటి సేవలను ప్రజలకు మరింత చేరువ చేస్తామని దేవరాపల్లి సొసైటీ అధ్యక్షుడు పూడి సత్యారావు అన్నారు. ఆదివారం సహకార వారోత్సవాల ప్రారంభం సందర్భంగా స్థానిక పిఎసిఎస్ వద్ద ఏడు రంగుల సహకార జెండాను ఆవిష్కరించారు. సహకార స్ఫూర్తిని ప్రతిబింబిస్తూ సిబ్బంది, సభ్యులు కలిసి సహకార గీతాన్ని ఆలపించారు. సహకార రంగాన్ని మరింత పటిష్టపరుస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పిఎసిఎస్ సభ్యులు గొంతెన నరసింహమూర్తి, సంఘం సిఇఒ ఎన్. కనకారావు, సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు. వారోత్సవాల సందర్భంగా వారం రోజులు చేపట్టే కార్యక్రమాలను సిఇఒ కనకారావు వివరించారు.

సహకార జెండాను ఆవిష్కరిస్తున్న సొసైటీ అధ్యక్షుడు సత్యారావు

పురుషోత్తపురంలో స్వచ్ఛభారత్

శ్రమదాన పనుల్లో పాల్గొన్న పిఎసిఎస్ చైర్మన్

ప్రజాశక్తి- యలమంచిలి టౌన్: మండలంలోని పురుషోత్తపురం గ్రామంలో పులపర్తి పిఎసిఎస్ చైర్మన్ కొలుకులూరి విజయరామరాజు ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. పురుషోత్తపురంలో రహదారులు, కాలువలు శుభ్రం చేశారు. ఈ సందర్భంగా విజయరామరాజు మాట్లాడుతూ, ప్రతి ఆదివారం గ్రామంలో నిర్వహించే స్వచ్ఛభారత్‌లో గ్రామ ప్రజలు, యువత భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పర్సన్ ఇన్‌ఛార్జి రాజాన వెంకు నాయుడు, ఎన్‌టిఆర్ యూత్ కుర్రాళ్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

గ్రామజ్యోతి యువత శ్రమదానం

ప్రజాశక్తి - యలమంచిలి : మున్సిపాలిటీ పరిధిలోని కొక్కిరాపల్లి వార్డు ప్రధాన రహదారిలో ఇరువైపులా ఉన్న తుప్పలు, ప్యాస్టిక్ వ్యర్థాలు, ఆదివారం స్థానిక 'గ్రామజ్యోతి' యువత సభ్యులు తొలగించారు. ప్రతి ఆదివారం రెండు గంటల పాటు గ్రామజ్యోతి యువత శ్రమదానం చేయడంపై కౌన్సిలర్ మజ్జి రామకృష్ణ, గ్రామ పెద్దలు అభినందించారు.

శ్రమదానంలో పాల్గొన్న గ్రామజ్యోతి యువత